
# బాల




## పిల్లల బొమ్మల పత్రిక

Vol. 2 : No. 3 | **BALA** | 6
అక్టోబరు .. | OCTOBER 1946 | అణా


అక్టోబర్ 1946 న

ఆంధ్ర, తమిళనాడు

అన్ని

ముఖ్య కేంద్రములలో

విడుదల!



# త్యాగయ్య

నాగయ్య

నటించిన

అమర చిత్ర

కళా సృష్టి...

డైరక్షన్ - నాగయ్య

నిర్మాతలు: శ్రీ రేణుకా ఫిలింస్ లిమిటెడ్

16, డాక్టరు నాయర్ రోడ్, త్యాగరాయనగర్, మద్రాస్.



# GRIPE-COL

**(For Children's Disorders)**

**A MECLEC PRODUCT**

## మెక్లెక్

## గ్రైప్ - కాల్

శిశువులయొక్క, పసిబిడ్డలయొక్క ఆరో
గ్యము, అభివృద్ధికిగాను ఉపయోగించు
రుచికరమగు పానీయము.

పిల్లలకు సాధారణముగా వచ్చు అజీర్తి,
కడుపుబ్బరము, కక్కులు, విరేచనములు,
పళ్లు మొలచునపుడు కల్గు నల్తలు మొదలగు
వానిని పోగొట్టుటకు మిక్కిలి ఉపయోగించును.

మీ బిడ్డలను ఆరోగ్యవంతముగ నుంచుటకు
గ్రైప్ - కాల్‌ను తప్పక వాడుడు.
అన్ని మందుల షాపులలోను దొరకును.

కంపెనీనుండికూడ వ్రాసి తెప్పించుకోవచ్చును :

**The Meclec Nutriments & Pharmaceuticals Ltd.,**

99-A, Armenian St., :: G. T. Madras.

బాలలకు బహు మంచి పుస్తకములు

# రాయుల వాచకములు

(1, 2, 3, 4, 5, తరగతులకు)

ఈ క్రింది శతకములు తెల్లని గ్లేజుకాగితమున చక్కని అక్షరములలో ముచ్చటగా ముద్రింపబడినవి. బాలలకొఱకు ప్రత్యేకముగ ప్రచురింపబడినవి.

| | | | |
|---|---|---|---|
| రామరామ శతకము | 0-2-0 | రాయల గణితబోధిని | 0-1-0 |
| నారాయణ శతకము | 0-2-0 | ఆంగ్లో తెలుగు ప్రైమరు | 0-5-0 |
| వేమన శతకము | 0-2-0 | నీతిశాస్త్రము తాత్పర్యము | 0-4-0 |
| సుమతిశతకము | 0-2-0 | డిటో టీకాతాత్పర్యము | 0-4-0 |
| కృష్ణశతకము | 0-2-0 | ,, ,, | 0-4-0 |
| బాలరామాయణము | 0-2-0 | ,, ,, | 0-4-0 |
| దాశరథి శతకము | 0-2-0 | ,, ,, | 0-6-0 |
| భాస్కరశతకము | 0-2-0 | ,, ,, | 0-8-0 |
| నరసింహశతకము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| గజేంద్రమోక్షము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| రుక్మిణీకల్యాణము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| అమరకోశము | 0 4 0 | ,, ,, | 0-8-0 |
| గృహసరస్వతి (ఇంగ్లీష్అడ్రసులు) | 0- 4-0 | పుష్పగిరి మహాత్మ్యము | 0- 4-0 |
| నీతిచంద్రిక శుద్ధప్రతి | 0-10-0 | ఆంధ్రనామ సంగ్రహము టీకా | 0-01-0 |
| ప్రేమకుమారి (నాటకము) | 1- 0-0 | ప్రియదర్శిని (నవల) | 1- 0-0 |

మద్దులేటి నృసింహ శతకము, (కందపద్యములు పాకెట్‌సైజు.) 0—2—0

వలయువారు:

## రాయలు అండు కో., పబ్లిషర్సు, కడప.

ఈ క్రిందివారివద్దకూడా పైగ్రంథములు దొఱకును. కొనునపుడు కడప రాయలు అండు కో వారి ప్రచురణములని అడుగుడు.

మదరాసు:-విజయమారుతి పబ్లిషింగ్‌హౌస్, 6, సుంకురామశెట్టి వీధి.
బెంగళూరుదండు:-న్యూ ఆనందా బుక్ డిపో; 2-3 ధర్మరాజు వీధి
హిందూపురము:-కస్తూర్బా స్టోర్స్
అనంతపురము:-B. C. ఆదినారాయణశెట్టి
బళ్లారి :-K. L. బ్రదర్స్
గుంతకల్లు:-కొండా బసన్నశెట్టి
ద్రోణాచలము:-శ్రీ మాణిక్యా స్టోర్స్
కర్నూలు:-వి. రామకృష్ణయ్య

నంద్యాల :-ప్రభాకర అండు కో;
గుంటూరు:-వెంకటేశ్వర అండు కో;
చిత్తూరు :-ది. ఓరియన్టు పబ్లిషింగ్ కంపెని
తిరుపతి :-గోల్డన్ బుక్ డిపో, కాళహస్తి:-జె. సుబ్బరాయుడుశెట్టి.
నెల్లూరు :-V. V. నాయుడు అండు సన్సు
కావలి:-కామేశ్వర బుక్ డిపో;
తెనాలి :-సుందరరాం అండు సన్సు
అనకాపల్లి:-మాదేటి సాంబమూర్తి
సికింద్రాబాదు :-కొండా వీరయ్య




అన్ని నొప్పులనూ పోగొట్టే

అందాల బాల

# అమృతాంజనము

# నేటి వస్త్రాలంకరణ

చేనేత మగ్గాల కోఆపరేటివ్ సొసైటీలు మద్రాసు రాజధానిలో ఇవాళ అన్ని నంబర్లలోనూ, రంగులలోనూ, నేతలలోనూ, ఫాషనులలో కలిగే మార్పులననుసరించి సున్నితమైన వస్త్రాలు తయారు చేస్తున్నాయి.

పవరు యంత్రాలమీద టోకుపద్ధతిని తయారుకావడంలో గట్టి లేకుండాపోయే మిల్లు చీరెలలాగా కాకుండా నేతచీరెలు గట్టిలోనూ, మన్నికలోనూ అసమానంగా వుంటాయి.

మద్రాసు కోఆపరేటివ్ చేనేత వస్త్రాలన్నీకూడా మధ్యవాళ్లు డబ్బు తినే ఏర్పాటు లేకుండా, రాష్ట్రమంతటా ముఖ్య బస్తీలలోవున్న ఈ సొసైటీ విక్రయశాలలలో కొనేవారికి నేరుగా నిర్ణయమైన ధరలకు అమ్మబడతాయి. ఈ విక్రయశాలల కొకసారి వెళ్లిచూచినట్లయితే మీకు వృధాప్రయాసలు తప్పుతాయి.

సరాసరి మగ్గాలమీదినించి మీకు:

ధోవతులు, చీరెలు, షర్టింగులు, తువ్వాళ్లు, అద్దకాలు, జంపకాణాలు, చీటిగుడ్డలు, కప్పడాలు, టేబిల్ లినెన్, దుప్పట్లు, రుమాళ్లు, లుంగీలు, వుత్తరీయాలు, దోమతెరలు, మెత్తలు, దిండ్లు, అన్నియు దొరకును.

## మద్రాస్ కోఆపరేటివ్ చేనేత గుడ్డలు

♦♦ నిర్ణయ ధరలకు తాజా సరకు ♦♦

మద్రాసు హ్యాండులూమ్ వీవర్స్ ప్రావిన్షియల్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్

6-ఎ, వుడ్సురోడ్డు, మౌంటురోడ్డు, మద్రాసు.




**'BALA' CHILDREN'S ILLUSTRATED MONTHLY.**

సంపాదకుడు: **న్యాయపతి రాఘవరావు, బి.ఏ.**

సహాయ సంపాదకురాలు: **న్యాయపతి కామేశ్వరి, బి.ఏ., ఎల్.టి.**

సంపుటి 2.] మదరాసు, అక్టోబర్, 1946 [సంచిక 3.


## గాంధీ జయంతి

మనకి బోలెడు పండుగలు ఉన్నాయి. కృష్ణజయంతి, వినాయకచవితి, దసరా పండుగలు, దీపావళి, సంక్రాంతిపండుగ, శ్రీరామనవమి, ఉగాదిపండుగ- ఈ పండుగలన్నీ అందరం చేస్తూ వుంటాం.

ఇవి పూర్వంనుంచీ వస్తూన్న పండుగలు. ఇప్పుడు మీరు "గాంధీజయంతి" అని కాంగ్రెసు జండాలతో ఊరేగింపు ఉత్సవాలు చూచేవుంటారు. కృష్ణుడు, వినాయకుడు, రాముడు, వాళ్ళందరూ దేవుళ్ళు. వాళ్ళ పండుగలు చేయొచ్చును గాని యీ గాంధీ పండుగ ఎందుకు చేయాలి?

గాంధీజీకూడా ఒక దేవుడితో సమానమే.

గొప్పగొప్ప పనులు ఎవరు చేస్తారో వాళ్లందరూ దేవుళ్లతో సమానం. గాంధీజీ మన దేశానికి ఎంతో మేలుచేశాడు. ఒకరిని బాధ పెట్టకూడదు, ఎప్పుడూ నిజాన్నే పలకాలి, దేశసేవ చేయాలి, జంకు, భయం వుండకూడదు అని గాంధీజీ కోట్ల కొలది ప్రజలకు బోధించాడు. ఒక్క మన దేశంలోనే కాకుండా ప్రపంచంలో అన్ని దేశాలవారూ గాంధీజీ "అవతార పురుషుడు" అని అన్నారు.

గాంధీజీకి ఇప్పుడు 77 ఏళ్ళు. ఆయన పుట్టినరోజు పండుగకే గాంధీజయంతి అంటారు.

గాంధీ తాతకు మన జేజేలు!

# ★ స్వరాజ్య దీపావళి ★

అవిగవిగో తారాజువ్వలు
తాతకన్న కోపంగా కస్సంటూ
జివ్వంటూ, రంయంటూ,
పరుగెడుతున్నాయ్!
పరుగెత్తే పిల్లల్లారా
పటాకీలు కావాలర్రా?
ఈ దీపావళి దివ్యకాంతులు
జయజయా స్వరాజ్యజ్యోతులు
జోహార్ జహ్వార్ జోహార్!
భారతమాతకి జోతలివే!
బంగారపు ప్రమిదల్లో
అత్తరు జ్యోతులు వెలిగిస్తాం
మీదటికి!
పరుగెత్తే పిల్లల్లారా
పటాకీలు పేలుస్తారా?
తెల్లమతాబా మొహంవేసుకుని
దొర్లంతా వెళ్లిపోతారు
మనదేశం మనకిచ్చి; కాని
చిటపటల వాళ్లూ,
సిసింద్రీల వాళ్లూ, మనవాళ్లే
కొందరు పెటపెటమంటూ
ఒంతులాటలో ఉజ్జీకి
కజ్జా పడుతున్నారు.
తారాజువ్వల ముందేమాత్రంలే!

రచన: "మహేశ్వర్"

# గాంధీ తాత

గాంధీ తాతకి
ఇప్పుడు
**77** ఏళ్లు.

ఆయన
పుట్టినరోజు పండగ
ప్రతీవాళ్లోనూ
చేస్తున్నారు.

★

"నాకు 125 ఏళ్లవరకూ బ్రతకాలని **వుంది.**" అని గాంధీ తాత అన్నాడు.

అలాగే బ్రతకాలని మనంకూడా కోరుదాం.

గాంధీకి జై!





# గాంధీతాత

బాలుల్లారా!
బాలికలారా!!
గాంధీతాతను
ఎరుగున్నారా?....


బోసినోటిలో
ముత్యాల్ వొలకగ
ముసిముసినవ్వులు
నవ్వుతువుంటాడూ.

పేదలసాదల
పిల్లలు అంటే
గాంధీతాతకు
ఎంతోయిష్టం.



దగ్గరకొచ్చిన
పిల్లల అందరి
బుగ్గలుగిల్లీ
కిలకిలనవ్వించూ.

కులములమతముల
బేధంచూడక
పిల్లలనందరి
ప్రేమిస్తాడూ.



మీమీనాన్నల
బానిసత్వమూ
పేదతనమ్మూ
పోయినరోజున
చదువులుబాగా
సాగును అంటాడూ.


అన్నదమ్ములై
అంతావుంటే
బానిసత్వమూ
పోతుందంటాడూ.

బాలుల్లారా!
బాలికలారా!!
గాంధీతాతను
ఎరుగున్నారా?....

రచన: పినపాల వేంకటేశ్వరరావు, బి. ఏ.



# పుట్టినరోజు



మాగాంధి తాతయ్యా
పుట్టినదినమున
మల్లెల్లవానల్లు
కొల్లగ కురిసేయి.

చిన్నారి మాతాత
వెన్నెల్ల నవ్వుల్లో
సన్నన్ని కాంతుల్లు
తిన్నంగ మెరిసేయి.

మాగాంధి తాతకు
మల్లెల్ల దండల్లు
మాబాల జేజేలు
మంగళారతులు.

రచన : కె. సభా [సేవాసమితి] దిగవమాఘం.



# ★ గాంధీ జీవితము ★

## (దసరా పద్యము)

వినరయ్య తెల్పెద విపులంబుగాను
మనగాంధి చరితంబు మహిమంబుగలది
పోరుబందరునందు పుట్టె నీఘనుడు
పేరుపొందినయట్టి ప్రేమపాత్రుండు
భరతదేశమునందు బాగుగాచదివి
తరువాత నింగ్లండు తానేగనెంచె
బారిష్టరుచదువు పఠియింపనచట
కోరికతోనుండె కోమలాంగుండు
పరదేశమేగుట పాడిగాదనుచు
అరుగనీయకతల్లి ఆటంకపఱుప
"మాతరో నాకోర్కె మన్నింపుమమ్మ
మత్స్యమాంసాదుల మద్యపానముల
ముట్టబోవనుతల్లి ముమ్మాటికైన
వట్టిమాటలుకావు ఫాలాక్షునాన
పరస్త్రీని తల్లిగా భావింతునమ్మ
భరతధర్మమునేను పాటింతునమ్మ"
అని పల్కిపోవగా ఆనతిన్ గోర
జననియా మాటకు సమ్మతింపంగ
పయనమై గాంధిజీ పరదేశమేగె
జయమందె బారిష్టరు చదువులోపలను

తరువాత ఇండియా తరలివచ్చెనుగ
భరతదేశముచేరి ప్రాక్టీసుపెట్టి
న్యాయవాదవృత్తి నయముతోఁగాంచ
న్యాయంబుకాదంచు నావృత్తివీడి
ఖ్యాతిమీటినయట్టి కాంగ్రేసుచేరి
భూతదయను గాంధి బోధించె ప్రజకు
జయజయా, జయజయా, జయమహాగాంధి.

రచయిత: సరిదేవి రామారావు ఆచారి,
యస్. యస్. యల్. సి. శ్రీకాకుళము.

## బాలకు దసరా పద్యం

దసరాకు మాబాల ♦ దశదిశల్ వెలయ
ఇంటింట మాబాల ♦ ఇంపుగావెలయ
ఇంపైన సొగసులతో ♦ సొంపుగామెరయ
తెలుగుతల్లికి బాల ♦ బంగారు బాల
బాలమే లేకున్న ♦ భాగ్యంబులేదు.
బాలలకు బాలయే ♦ భాగ్యంబుసుమ్మి
దినదినము మాబాల ♦ దీప్తియైవెలుగు
చిరంజీవి యనుచు ♦ దీవింపరండి.
జయీభవ విజయీభవ దిగ్విజయీభవ.

రచన: పి. రాజామణి (కటకం)

# ★ వీళ్ళందరూ


రచన! ఘాశి పాళ్ళ



చక్కని రైతువు నీవైతే
పెక్కగు భూముల దున్నెదవూ.



చక్కని కుమ్మరి నీవైతే
పెక్కగు కుండల జేసెదవూ.



చక్కని సాలెవు నీవైతే
పెక్కగు బట్టల నేసెదవూ.



చక్కని చాకలి నీవైతే
పెక్కగు బట్టల ఉతికెదవూ.

# చక్కనివారే! ★

కృష్ణమూర్తి




చక్కని మేదరి నీవైతే
చిక్కగ బుట్టల అల్లెదవూ.



చక్కని సెట్టివి నీవైతే
పెక్కగు సరుకుల అమ్మెదవూ.



చక్కని గొల్లవు నీవైతే
మిక్కిలి పాలను పితికెదవూ.



చక్కని పంతులు నీవైతే
పెక్కగు విద్దెల నేర్పెదవూ.

# పూలబాల



"త్యాగయ్య" ఫిలింలో నటించిన

చి॥ టంగుటూరి శ్యామల.

# పువ్వుల పందిట్లో పుట్టినరోజు

ఈ పక్క పేజీలో చూడండి. ఒక అమ్మాయి పువ్వులపందిట్లో ఎంతో చక్కగా కూర్చుంది. ఆ అమ్మాయి ఎవరో తెలుసా? చి॥ టంగుటూరి శ్యామల.

శ్యామలపేరు మీకు కొత్త కాదు. ఇదివరకు శ్యామలగురించి 'బాల'లో చదివే వుంటారు. శ్రీ నాగయ్యగారు తీసిన "త్యాగయ్య' ఫిల్ములో శ్యామల రాధ వేషం వేసింది. కొద్దిరోజుల్లోనే ఆ ఫిలుం పెద్ద పెద్ద వూళ్లలో చూపెడతారు. అందులో రాధాకృష్ణులు, గోపికలడాన్సు వుంది. చాలా బాగావుందని అంటున్నారు. మీరు తప్పకండా అందులో పిల్లల డాన్సు చూస్తారుకదూ!

శ్యామల యీమధ్యనే పుట్టిన రోజు పండగచేసుకుంది. పుట్టిన రోజునాడు అందర్ని పిలిచింది. నేనుకూడా వెళ్లాను. శ్యామల ఎంత చక్కని పువ్వుల పందిట్లో నవ్వుతూ బొమ్మలాగ కూచొని వుంది.

ఇంత అందమైన పూలకోట ఎవరు కట్టారా అని అడిగేను. ఈ వూళ్లో (మదరాసులో) మనకి కావలసినన్ని పువ్వులు దొరుకుతాయి. పువ్వులుఅమ్మే అంగడే వుంది. ఏదేనా ఉత్సవాలు పండగలువస్తే ఇక్కడ పువ్వులతోనే అలంకరిస్తారు. గులాబీ పూలతోనూ, మల్లెపూలతోనూ పెద్ద పెద్ద హారాలు కడతారు. దేవుళ్ల వూరేగింపుకి పువ్వుల పల్లకీలు, పెళ్లిళ్లకి పువ్వులతో మోటారు కార్లు కడ్తారు.

అలాగే చిన్నిపిల్లల పుట్టిన రోజుకి పూలపందిరివేసి చాలా బాగా అలంకరిస్తారు. సరే, పుట్టింరోజు కొత్తబట్టల సంగతా? చెప్పనే అక్కరలేదు.

రచన: "లీల"

(బాల విలేఖరి)



# పొట్టి నక్క

పొట్టినక్క పొట్టినక్క ఏంచూసింది?
చెట్టుమీఁదనున్న ద్రాక్షపండ్లు చూసింది;
పండ్లుచూచి నోరుఊరి ఎగురు ఎగిరింది;
ఎగిరిఎగిరి అందలేక క్రిందపడింది;
క్రిందపడి కుంయి కుంయి కుంయి మనింది
పండ్లుఅన్ని పులుపుఅనుచు పాఱిపోయింది.

(అందితే తీపి; అందకపోతే పుల్లన!)

రచన: బి. బి. వెంకట్రావ్,
(చొల్లంగిపేట)

# * ఎవరి పాపాయిలో? *

రచన: నాగవోలు వెంకటఅప్పారావు, టీచరు, పాలకొండ.

చైత్రమాసములోను చిట్టిపుట్టింది
వైశాఖమాసమున విజయ పుట్టింది
జ్యేష్ఠమాసములోను జన్మించె కమల
ఆషాడమందున ఆ బాల విమల
శ్రావణములో పుట్టె శ్రీరమణసుగుణ
భాద్రపదమాసమున పుట్టింది సగుణ
ఆశ్వీయుజమునందు ఆనందు పుట్టె
కార్తీకమందున మూర్తిపుట్టేడు
మార్గశిరమందున మాధవుడుపుట్టె
పుష్యమాసములోన పుట్టింది లీల
మాఘమందునపుట్టె మాలతీమాల
ఫాల్గుణములోపుట్టె పద్మాక్షిబాల
ఎవరిపాపాయిలో ఎంచగా వీరు?
దేవదేవుని చిన్ని దీపాలెవారు!



# ★ డాక్టరు బాల

రచన: యడవల్లి
రామశేషయ్య
బి. ఏ; బి. యల్.
మద్రాసు.

మా ముద్దు బాలకు "సుభద్ర" అనే పేరు పెట్టినాను. పిలవడం మాత్రం ముద్దుగా "శుభా" అని పిలుస్తాను. వాళ్ల నాన్నైతే మాత్రం తన తల్లి పేరు జ్ఞాపకార్థం "సత్యవతి" అనే పేరు పెట్టాడు.

"శుభా"కు నాలుగేళ్లుంటాయి. తన చక్కని కంఠస్వరంతో సినీమాలో అచ్చటా విన్న పాటలు పాడుతుంది. చూచిన అభినయం, నృత్యం, చూపిస్తుంది. ఆమెకు "బాల" అంటే చాలా యిష్టం. వాళ్ళ నాన్న తేగానే అందులోవున్న పాటలూ, కథలూ, చెప్పమంటుంది. చిన్నన్న యేదో అడ్డమొస్తే "పోరా బొజ్జికుక్కా" అని గదమాయిస్తుంది.

"శుభా" చాలా మెత్తని మనసు కలది. ఎక్కడైనా చిన్నపిల్ల యేడుస్తూవుంటే "అయ్యో, పాపం, బుచ్చిపాప యేడుస్తున్నది" అని జాలి చూపుతుంది. ఏదైనా వ్రాస్తూవుంటే నెమ్మదిగా నవ్వుకుంటూ వచ్చి ఆ కాగితం లాగుతుంది. కాస్త విసుక్కుంటిమా, "పో, బెండకాయ, టూ కాకరకాయ, టూ. నీతో మాత్లాలను" అని ఒక వేలు నోటిమీద వేసుకొని కోపం అభినయిస్తూ వెళ్లిపోతుంది. ఆ తరువాత పిలుస్తే "యిందాక నన్నెందుకు కోప్పడ్డావూ?" అని ప్రశ్నలు వేస్తుంది. సరియైన సమాధానం చెబితేనేగాని ఆమె కోపం శాంతించదు.

వేసవికాలం శెలవుల్లో ఒక మధ్యాహ్నం పరుండివుండగా, చక్కగా గౌను వేసుకుని నవ్వుకుంటూ నా గదిలోకి మహా పనివున్నదానివలె వచ్చింది. ఏం చేస్తుందో అని చూస్తున్నాను. డాక్టరు పరీక్ష చేసినట్లు నాగుండె మీద చేయిపెట్టి చూడడం మొదలుపెట్టింది.

"డాక్టరుగారూ, యెలావున్నదండి?" అని అడిగాను.

"దొంతాకు! మా తాలకు! నీవు యీ గదిలోనుంచి వెళ్లకూలదు" అని ఆజ్ఞాపించి, గదితలుపు బైట గడియబెట్టి వెళ్లిపోయింది.

మళ్ళీ అయిదునిముషాలైన తరువాత తలుపుతీసికొనివచ్చింది.

"డాక్టరుగారు సంగతేమిటి?" అని అడిగాను.

"సతప్, నోరు మూచికో" అన్నది. నా చొక్కాచేయి పైకి మడిచి జబ్బమీద ఒక గిల్లుగిల్లి యింజక్షను యిచ్చింది.

"నీవు పెలుగు పోచికొని వేలన్నం తిను" అన్నది.

"మామిడిపండు తినొచ్చునా అండి డాక్టరుగారూ?"

"కలుపు నొప్పొత్తుంది. నీవు తినకూలదు."

"పోనీ, సిగరెట్టు కాల్చవచ్చునా అండి డాక్టరుగారూ?" అని అడిగాను.

"దగ్గొత్తుకొత్తుంది. కాల్చకూలదు" అని సిగరెట్టు కేసు పట్టుకొనిపోయింది డాక్టరుగారు.

ఆ సాయంత్రమంతా ఆవిడ యీాయనే లేదు.

రాత్రి భోజనాలదగ్గిర, మా మాలుప్రకారం నాదగ్గర కూచున్నది.

"డాక్టరుగారూ, ఆవకాయ తినవచ్చునా అండీ?" అన్నాను.

"నేను యిప్పలు దాకతరు కాదండీ. ఇత్తంవచ్చింది తినండి" అని నవ్వుకుంటూ వుత్తరువిచ్చింది.


ఆ ముద్దుబాల "శుభా" చేసే పనులెప్పుడూ మనస్సుకు ఆనందమిస్తవి.

# ఎక్కడచూచినా గడలే!

[ప్రతిరోజూ మనం ఎన్నో గడలు చూస్తూవుంటాం, అవునా? ఏదీ ఈ క్రిందివి ఏగడదో చెప్పండీ చూద్దాం]

1. పాలమీద వుండేది.
2. ఒక చెట్టు.
3. హాయిగా నిద్ర కలుగజేసేది.
4. తియ్యగా వుండేది.
5. పోవడం.
6. గల్లంతు.
7. వెలిగించేది.
8. జీవించడం.

[సమాధానాలు ఒచ్చే సంచికలో]




# శ్రీ కృష్ణుడు

బలరాముడు పరిగెత్తుకుంటూ వచ్చి వగురుస్తూ వాళ్లమ్మతో చెబుతున్నాడు—"అమ్మా, అమ్మా, మరేం, మరేం—"

యశోద ఆదుర్దాతో వింటూ, "ఏం జరిగిందేమిటిరా, చెప్పవేం, గబగబా."

బలరాముడు : "అమ్మా, మరేం, మనకృష్ణమ్మ లేడూ, వాడే, వాడేనే,—"

యశోద :-"ఏం చేశాడేమిటి?"

బల :-"వాడేనే అమ్మా, తింట. మేమంతా ఆడుకుంటూంటే మన్నులో చదికిలబడితిన్నాడే. అమ్మతో చెబితాడుండు అని నేనంటే, చెప్పరో కావలసిస్తే నాకేం భయంలేదు, అన్నాడే."

యశో :-"ఏంతిన్నాడేంతిన్నాడు. చెప్పరా, చప్పని."

బల :-"ఎంతచెప్పినా నీకు తెలియదేమిటే. నే వద్దంటూనే ఉన్నానే—"

యశో :-"అవునులే, వాడేమిటి తిన్నాడు?"

బల :-మన్నే! నేనొద్దంటూంటే, గుప్పిళ్లతో తీసికొని బొక్కుతున్నాడే--నే నొద్దంటూన్నకొద్దీ మరీ బొక్కాడే."

యశో :-మన్నే, అయ్యో కొడకా, మన్నెందుకుతిన్నావురా, నీకేం లోటొచ్చిందని మన్ను తిన్నావు - అడుగుతాఉండు. కృష్ణా, కృష్ణమ్మా, ఎక్కడున్నావు? ఇలారా ఒకమాటూ."

చిన్నికృష్ణమ్మ గబగబ పరిగెత్తుకువచ్చి వాళ్లమ్మ కాళ్లు కౌగలించికొని నవ్వుతూ

వాళ్ళమ్మ మొహం చూస్తూ, "అమ్మా, అమ్మా నన్నెం దుకే పిలిచావు?"

యశో :- "అవునుగాని, నువ్విప్పుడు మన్నుతిన్నావా లేదా? నిజంచెప్పు."

కృష్ణుడు :- "నేనా? మన్నా? ఎవరన్నారేనీతో?"

యశో :- "అన్నయ్య చెబుతు న్నాడు, చూడు—"

కృ :- "ఉత్తిదే, వాడు చెప్పేవన్నీ శుద్ధ అబద్ధాలే."

బల :- "నువ్విప్పుడు మన్ను తిన లేదురా? అమ్మతో చెబతానుందుఅంటే 'నాకేం భయం లేదు చెప్పుకో' అన్నావు కాదూ?"

కృ :- "చూశావా, చూశావా, చూశావుటే అమ్మా, బలరామన్నయ్య ఏలాంటి అబద్ధాలాడతాడో. వాడిమాట లెప్పుడూ వినకే అమ్మా."

బల :- "నేనబద్ధా లాడుతున్నానుటచూడవే అమ్మా. వాడెప్పుడూ అబద్ధాలేనే."

యశో :- "అవునా, కృష్ణా?"

బల :- కావలిస్తే మాతో ఆడుకొనే ఆటపిల్లల్ని పిలవ్వే."

కృ :- "పిలు, కావలిస్తే, నాకేం భయమా ఏమిటి? ఉత్తిదే అమ్మా, అన్నయ్యమాటలు వినకే."

బల :- "చూడమ్మా వాడి నోరు చూడు, నోట్లో మన్నుందో లేదో."

యశో :- "నీకేం తక్కువయిందని నువ్వు మన్ను తింటావురా? ఇప్పుడేగదా, పట్టెడు వెన్న పెట్టాను, నీకు."

కృ :- "పోనీ అమ్మా, నువ్వెప్పుడూ ఇంతే! వాడిమాటలే వింటావు. వాడు నామీద ఏం చెప్పినా వింటావు."

బల :- "ఎలా మూతిముడుస్తాడో చూడు. నోరు చూపించమనవే, అమ్మా! చూపించమను. నేను ఆటపిల్లల్ని పిలుచుకు వస్తానుండు."

కృ :- "నేను మన్నెందుకు తింటానే, నాకు తెలియదుటే అమ్మా! నన్ను నీచేత కొట్టించాలని అలా అంటాడే అన్నయ్యా."

యశో :-"ఏదే నీనోరు చూడ నియ్యి, ఆ అమ్మ, నువ్వు మన్ను తిన్నదీ లేనిదీ నేచూస్తాను."

కృ :-"పోనీలేవే అమ్మా. నా మాట ఎంతకీ వినవు."

యశో :-"నాయన కాదు, నా తండ్రివికాదు, ఆలను అమ్మా, ఆ అను—నీ నోరు చూడ నియ్యి—"

కృ :-"నన్ను కొట్టనంటే చూపిస్తాను."

యశో :-కొట్టనులే నాయనా, కొట్టను, నువ్వు మన్ను తినక పోతే ఎందుకు కొడతాను-"

కృ :-"ఊఁ, కొడతావూ—"

యశో :-"నాయన కాదు, నా బుచ్చినాయన్ని నేకొడతానా, కొట్టనులే, నోరుచూపించు."

కృ :-"నోట్లో ఏముంటుందే అమ్మా."

యశో :-ఏముందో చూస్తాగా."

కృ :-"అయితే, చూడు" అని చిన్నికృష్ణుడు తల్లికినోరువిప్పి చూపాడు.

యశోద శ్రీకృష్ణుని నోట్లో ఏమి చూచిందనుకొన్నారు. పెద్ద పెద్ద పర్వతాలు, నదులు, అడవులు, పట్టణాలు, ఆకాశం, నక్షత్రాలు, గ్రహాలు, సూర్యుఁడు, చంద్రుడు—ఈ భూగోళాన్నంతా చూచింది-బ్రహ్మాండాన్ని చూచింది.

కలకంటూన్నానాఅనుకుంది. తన చిన్నికృష్ణున్ని తొడ మీద కూర్చొపెట్టుకుంది—కల గాదనుకొంది. లేకుంటే ఏమిటీ విపరీతం!

బ్రహ్మాండాన్ని తనకడుపులో పెట్టుకున్న యీ కృష్ణమ్మ, ఎవరో? ఇతడే ఆదివిష్ణువని నిశ్చయించుకొంది.

శైశవంలో బ్రహ్మాండాన్ని తనకుక్షిలోచూపిన శ్రీకృష్ణుడు గొప్ప బాలవీరుడుకాదూ?






# ★ దసరా ★

దబ్బునవచ్చెను దసరాపండగ
బాలలందరు భక్తితోగూడీ
మందారంబులు మాలలుగట్టీ
సంపెంగములతో సన్నజాజులతో
వాణినివేడగ రారండోయ్.

మరువము మల్లెలు మాలతీలతో
కదళీ ఫలములు కర్పూరమును
అగరు వత్తులు అర్పించగను
సరస్వతిదేవికి సంతోషముతో
సాగిలి మ్రొక్కగ రారండోయ్.

తాతా వెంకట ఉమాదేవి.
(బొబ్బిలి.)





# దసరా అంటే

రచన :

దసరా అంటే అందరికీ సరదా! అయితే యీ దసరా పండగలు ఎందుకు చేస్తున్నామో మీకు తెలుసా?...


దసరా అంటే దశరాత్రులు, అంటే పదిరాత్రుల పండగ అని అర్థం. ఇంక కథ చెప్తా.

పూర్వం మహిషాసురుడనే ఒక రాక్షసుడుండేవాడు. వాడు ఎంతో బలశాలి, ధైర్యవంతుడును. మహిషాసురుడు బ్రహ్మను గురించి తపస్సుచేసి ఎన్నో వరాలు పొందాడు.

ఆఖరికి స్వర్గాన్ని కూడా జయించడానికి ప్రయత్నించేడు. ఇంద్రుడు ఇది తెలుసుకొని నారదుడుతో ఎన్నో వుపాయాలు ఆలోచించేడు. ఆఖరికి ఇంద్రుడు ఒక ఉపాయంపన్ని నారదుడుతో చెప్పేడు. అదే తగినయెత్తు అని నారదుడు భూలోకంలోనున్న మహిషాసురుడు దగ్గరకి వెళ్లేడు.

ఆ రాక్షసుడు నారదుని ఎంతో మర్యాదచేసేడు. మహిషాసురుని బలపరాక్రమాన్ని, అతని రాజ్య వైభవాన్ని పొగిడి నారదుడు "నీవు చక్కని కన్యను పెండ్లియాడిన నీ ఐశ్వర్యము మఱియంత హెచ్చును" అని చెప్పేడు.

దానికి మహిషాసురుడు సంతోషించి "మునీంద్రా! మీరు మూడులోకములు సంచారము చేయుచుందురకదా? నాకుతగిన త్రిలోకసుందరియైన కన్య ఎక్కడ నున్నదియో చెప్పిన నేను ఆమెను వివాహ మాడెదను" అని అన్నాడు.



# ఏందుకు సరదా?

"స్వాతి"

అప్పుడు నారదుడు "మందర పర్వతముమీద త్రిపురసుందరి యను ఒక ఆమెగలదు. ఆమెయే నీకు తగును. ఆమెను పెండ్లి యాడు" అని చెప్పేడు.

మహిషాసురుడు సంతోషించి ఆ మందరపర్వతందగ్గరకి వెళ్లేడు. అక్కడ ఆమెను కలిసికొని తన్ను పెండ్లియాడుమని అడిగేడు.

ఆ త్రిపురసుందరి ఆదిశక్తి కాబట్టి జరిగినది తెలుసుకొని, ఈ రాక్షసుడు తనచేత చచ్చుటకు నారదుడు పన్నిన పన్నాగమని గ్రహించి "ఛీ! రాక్షసుడా! నిన్నా నేను పెండ్లియాడెదను. పొమ్ము" అని అంది. ఈమాటలకు మహిషాసురుడికి కోపంవచ్చి ఆమెతో యుద్ధం చేసేడు.

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు, ఆ యుద్ధం పదిరోజులు జరిగింది. ఆఖరికి, దశమినాడు ఆ దేవి అతనిని చంపి జయించింది. కాబట్టి దసరాకు విజయ దశమి పండుగ అని కూడా అంటారు.

ఇది కాకుండా విరాటరాజు కొలువులో బృహన్నల అన్న మారువేషంతో యున్న అర్జునుడు ఉత్తరకుమారుడుకి రథసారధిగా వెళ్లినప్పుడు జమ్మిచెట్టుమీద దాచబడి యుండిన ఆయుధములను తీసికొని, కౌరవులతో యుద్ధంచేసి, వారి యందరిని ఓడించిన రోజుకూడా ఈ ఆశ్వయుజ శుద్ధ దశమే.

అందువలనే దానికి విజయ దశమి అని పేరు వచ్చిందని కొందరంటారు.

రెండూ నిజమే కావచ్చు!

ఏమైనా యీ పదిరోజులు మనకు పండుగరోజులు. కొందరు ఐశ్వర్యంకోసం లక్ష్మిని, కొందరు విద్యకోసం సరస్వతిని, శక్తికోసం పార్వతిని పూజచేస్తారు. పల్లెటూళ్ళ బడులలో మేష్టర్లు పిల్లల చేత దసరా పద్యాలు పాడించి వాళ్ల తల్లిదండ్రులవద్ద, బంధువుల వద్ద బహుమానాలు పుచ్చుకుంటారు.

బంగాళా దేశంలో, అంతటా గొప్ప కాళీపూజ వుత్సవాలు చేస్తారు. మన దక్షిణ దేశంలోను, మైసూరులోను, కూడా గొప్ప వుత్సవాలు చేస్తారు. ఇంటింటా బొమ్మల కొలువులతోను, ఆడపిల్లల పేరంటాల సందడితోను మన ఆంధ్రదేశంకూడా కలకలలాడుతుంది.

ఇక కొత్తబట్టలు, పిండివంటలు మాట మరి వేరే చెప్పాలా?

# రేడియో దసరా పిల్లలు



తెలుగుపిల్లల ప్రోగ్రాంలో పాడుతున్నారు.

# దసరా బొమ్మల కథ




1

విమల దసరా బొమ్మ కొనుక్కుంది. దానితో ఆడుకుంటోంది. ఇంతలోకి రామం బావ వచ్చాడు. బొమ్మని ఓసారి ఇమ్మని అడిగాడు. విమల ఇయ్యలేదు.

2

రామంకి కోపం వచ్చింది. "అయితే చూడు నిన్నేంచేస్తానో!" అని బెదిరించాడు. గబ గబ వెళ్లాడు. ఒక విల్లంబు తీసుకొచ్చాడు!








3

విమలకి భయంవేసింది, బాణం తనమీదికి రామం వేస్తాడేమో అని! "అమ్మో!" అని భయంతో కేకవేసింది.

4

రామం విల్లు గురిపెట్టి బాణం వదిలాడు. ఆ బాణంలోనుంచి పువ్వులు రాలాయి! ఇంతాచేస్తే అది దసరా పువ్వుల బాణం!

బొమ్మలు "బాపు"



# * దసరా పద్యాలు -

[దసరా పండగల్లో మీరు విల్లంబులు పట్టుకొని, పద్యాలు పాడుతూ ఇంటింటా తిరుగుతారు. బలే సరదాగా వుంటుంది కదూ? మీ గురువుగారు మీకు ఎన్నో దసరాపద్యాలు నేర్పివుంటారు. ఇదుగో ఈ "బాల" కొన్ని దసరాపద్యాలు నేర్చుకుంది. మీరుకూడా చదవండి.]

## జట్టు కలపడం

ఎందుకీ క్రోధాలు ♦ భేదాలు మనకి
ముస్లిం సోదరా! ♦ మాదరికి రమ్ము
భారత భూమిలో ♦ పుట్టి పెరిగేము
ఈనాడు మనకింత ♦ పోరాట మేల
జాతితో పనిలేదు ♦ నీతి కావలెను
జాతి భేదము లేక ♦ జట్టు కలపండి
ఇన్నాళ్ల వరకును ♦ జిన్నా మెమీాకు
నాయకుడై మిమ్ము ♦ నాశనముచేసె
ఐకమత్యములోనె ♦ ఆనందముంది
నాయకుడు జవహరు ♦ నాయకత్వాన
తొల్లింటి ప్రఖ్యాతి ♦ తేవాలి మనము
జయజయా - జయజయా - జయ మహా విజయ.

రచన: స్వామి ఆలస్యనాథ్ (అనకాపల్లి)

# దసరా పద్యాలు *

ఆరోగ్యమే మహా భాగ్యంబటంచు
ఆదినుండియు పెద్దలనుచునున్నారు
అశ్రద్ధచేయకను ఆలించిమమ్ము
ఆరోగ్యమందు డీ యాంధ్రసోదరులు.

పరిశుభ్రమైనట్టి వాయుప్రసరణకు
గృహమునకు కిటికీలు కొమరొప్పనుంచి
మంచినీళ్లవిదారకు మంచివసతులను
యోచించి నూతులను ఏర్పరుపవలయు.

రోగముల కాకరంబై వెలసినట్టి
అజీర్ణమనువ్యాధి అంతరించుటకును
పక్వంబులైనట్టి ఫలములను దినుచు
ఆరోగ్యమొనగూర్చు ఆహారమెపుడు
సేవింపమనమెల్ల సుఖమందగలము.

వ్యాయామ మనుదినము వ్యాప్తిచేయుచును
ఆటలను అందరును ఆడంగవలయు
గృహపరిసరములను గుర్తించవలయు.
పరిశుభ్రముగనుంచ పాటుపడవలయు
ఆరోగ్యసూత్రముల్ అతిసూక్ష్మముగను
బాలసంఘములోని బాలురము మేము
పలికితిమి యీరీతి పలుకదలచినవి.
ఆచరణకునుంచుడీ యభిమానులారా!
వినిమోదమందుడీ విజ్ఞానులారా?
జయ విజయా జయా, జయ మహా విజయ.

రచన: పొలమరశెట్టి సాంబమూర్తి, (విజయ బాల సంఘం, అనకాపల్లి)

# రబ్బరు బొమ్మల నాటకం

లీల కొలువుపెట్టింది. కొలువులో లక్కపిడతలూ, రబ్బరుబొమ్మలూ, సెలులాయిడు బొమ్మలు, చందనపు బొమ్మలూ, కొయ్యబొమ్మలు, గాజుబొమ్మలు, రకరకాల బొమ్మలున్నాయి.

లీల కొలువులో ఒక పార్కు వేసింది. ఆ పార్కులో నాలుగు వైపులా రోడ్లు వేసింది. ఒకమూల మట్టితో గట్లుకట్టి, నీరుపోసి, ఒక చెరువు తయారుచేసింది. ఆ చెరువులో నీటిమీద తేలే పడవలు, చేపలు వేసింది.

ఆ కొలువులోనే రెండు కొండపల్లి బొమ్మలున్నాయి. గీరల చొక్కాతో ఉన్న బొమ్మపేరు గోపీ. తెల్లచొక్కాతో వున్న బొమ్మపేరు శీను.

గోపీ, శీను, ఒక కొలువునాటి రాత్రి ఇలాగ అనుకున్నారు.


గోపి :—శీనూ! మనం ఇద్దరం సరదాగా ఆ చెరువులో షికారు వెళదామా!

శీను :—అలాగే. కాని, నీటిమీద షికారు ఎలాగ వెళ్తాం?

గోపి :—అదుగో ఆ రబ్బరు బొమ్మలున్నాయి. ఆ బొమ్మలలోని బాతుబొమ్మ నేను తీస్తాను. ఏనుగుబొమ్మ నువ్వు తియ్యి. ఆబొమ్మల్లోకి గాలి ఊదితే, అవి పొంగుతాయి. వాటిని నీటిమీద వేస్తే తేల్తాయి. అప్పుడు వాటిమీద మనం కూర్చుంటే మనంకూడా నీటిమీద తేలుతూ షికారు వెళ్లాం.

శీను :—సరే! బాగానేవుంది. నాది ఏనుగు, నీది బాతు. చూద్దాం! ఎవరు యీదుకుంటూ ముందుగా అవతలగట్టు చేరుతారో—పందెం!

గోపీ, శీనూ ఆ రబ్బరుఏనుగు, రబ్బరుబాతూ తీశారు. వాటిలోనికి గాలి ఊదారు. అవి పొంగాయి.




శీను ఏనుగెక్కాడు, గోపీ బాతు ఎక్కాడు. ఇద్దరూ రెండు తెడ్లు పట్టుకున్నారు. నీటిమీద, సరదాగా నవ్వుకుంటూ బయలు దేరారు.



కొంతదూరం వెళ్లారు. శీను తన ఏనుగుమీద గబగబ వెళ్ళి పోతున్నాడు!

గోపీ తన బాతును తొందర పెడుతున్నాడు. కాని శీను గెలిచి పోతాడేమో అని భయం వేసింది.

శీనుకి సంతోషం హెచ్చింది. తన ఏనుగే ముందు వెడుతోంది! "ఊం! ఇంకా గబగబయీదు" అని శీను తన తెడ్డుతో ఏనుగు వీపుమీద కొట్టాడు. ఏనుగు వీపు మీద చిన్న కన్నం పడింది. గాలి




తుస్ మంటూ పైకి వచ్చేసింది. ఏనుగు నీటిలో మునిగిపోతోంది!

ఇంతలో గోపి తన బాతు మీద హాయిగా అవతలి గట్టు చేరుకొన్నాడు.

శీను చేతుల్లో, చినిగిపోయిన రబ్బరు ఏనుగు, లొటలొట లాడుతూవుంది.

పాపం, శీను ఏంచేస్తాడూ?




చూశారా! లీల బొమ్మల కొలువులోని బొమ్మలనాటకం!

# ఐటియాల్

## ఆదర్శప్రాయమైన దుర్గంధనివారిణి-

ఘాటైనది, కాని, హాని చేయనిది

గీరకులను, గాయాలను మాన్పును

పుక్కిట పట్టుటకుగాని, పరిశుభ్రతకుగాని ఉపయోగపడును

I·T·L ప్రాడక్టు

సెల్లింగ్ ఏజెంట్లు : ఓస్ట్ అండ్ కంపెని, లిమిటెడ్.,
పోస్టు బాక్సు నెం. 63, మద్రాసు.


---

## రీటా తల వెంట్రుకలను పెంచును



రీటా కురుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెంట్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును. సీసా 15అ.




**RITA**
**HAIR TONIC**

## పిల్లలకు ఒక కథ

# సబ్బు, నీళ్లు

ఎండ వేడిమిగా నున్నప్పుడు "మంచి చన్నీళ్ల స్నానం ఎందుకు చేయరాదు" అని అమ్మ అంటూ ఉండేది.





నీళ్లు పోసుకోవడం అంటే నాకు అసహ్యం కనుక 'నాకువద్దు' 'నాకువద్దు' 'నాకువద్దు' అని అరుస్తూ కోపంతో వెళ్లిపోయేవాడిని.



కాని,

ఇప్పుడు మా ఇంట్లో హమామ్‌సోపు ఉన్నది. అంత చక్కని వాసనగల నురుగును ఇచ్చే యీ పెద్దబిళ్లతో నీళ్లుపోసుకోవడం అంటే నిజంగా నాకు ఇష్టం. అమ్మచెప్పింది యదార్థం. ఎండగా ఉన్న రోజున చల్లదనం అనుభవించాలంటే ఉత్తమమార్గం సబ్బు, మరినీళ్లు. ఆపాదమస్తకం హాయిగా ఉండేటట్లుచేస్తుంది అది.

భారతదేశ జనులు మక్కువతో వాడే సబ్బు.

**ది టాటా ఆయిల్ మిల్సు కం. లి. వారిచే**

**తయారు చేయబడినది.**




[పాప దొడ్లో కెవ్వున కేకేసింది. ఏమిటాఅని నేను, అమ్మ, అక్క పరుగెత్తేము. పాప చెట్టు కింద ఏడుస్తోంది.]

"ఎందుకే ఏడుపు" అంది అమ్మ.

"ఉఁ... పెద్దకోతి. నేను మొక్కజొన్న కండె తింటోంటే మీదబడి లాక్కుందే..." అని ఏడ్చింది పాప.

"ఉస్ – ఇంతేగా ఇంకోటిస్తాలే" అని అమ్మవంటింట్లోకి వెళ్ళిపోయింది.

[అక్క, నేను, పాప చావిట్లోకి వచ్చి కూచున్నాము]

"ఏంకోతమ్మా అది? ఎలా వుందీ?" అని అడిగింది అక్కయ్య.

"అదా! ఇంతపెద్దది– ఎఱ్ఱగా వుంది. దానికి రెండుతోకలక్కయ్యా" అంది.

"రెండుతోకలు కోతి కెక్కడైనా వుంటాయా?" అన్నా నేను.

"అబ్బే అది కుఱ్ఱది. దానికేం తెలుసు!" అని పాపవంకచూసి అది తన పిల్లని పొట్టకు కరచుకుందమ్మా! అంచేత పిల్లతోక వొకటి – తల్లి తోక వొకటి – రెండు" అంది అక్కయ్య.

ఇంతలోకే అమ్మ పాపని కేకేసింది. పాప వెళ్ళిపోయింది. అక్క నావంకకు తిరిగి...

"ఏంరా! తమ్ముడూ! కోతిని తల్లిపొట్టన ఎత్తుకు తిరుగుతుందెందుకురా?" అన్నది.

"ఆ పిల్లకోతి నడవలేదని" అన్నాను.

"ఛా! అందుకు కాదు" అన్నది.

"అయితే నువ్వే చెప్పు!" అన్నాను.

"సరేలే - మరి - పూర్వం రాములవారు సీతాదేవికోసం అరణ్యమంతా వెతికారు తెలుసా?" అని అడిగింది.

"ఓ - అది తెలియకేం" అన్నాను నేను.

—మళ్లీ కథ సాగించింది అక్కయ్య—

"అలాతిరుగుతూ చివరకు ఓ కోతులరాజ్యంలోకి వెళ్లేరు. ఆ కోతులన్నిటికి ఓ పెద్దకోతి రాజు. అక్కడ మనరాములవారు వాటితో మచ్చిక చేసుకున్నారు. ఓ రోజున అక్కడ పడుకుని నిద్రోతూంటే అక్కడి కోతిపిల్ల ఒకటి ఆయనకాలు కొఱికింది. ఆయనకు నొప్పి కలిగింది..."

"ఎవరినీ?"

"ఆరాములవారినే నే పాపం."

ఆసంగతి ఆ కోతులరాజుకు తెలిసింది. ఆ రాజుకు కోపము వచ్చి సరాసరి ఆ కోతిపిల్ల తల్లి దగ్గరకెళ్ళి 'నీ పిల్ల మా దేవుడి కాలు కొఱికింది. నిన్ను చంపేస్తా' అన్నాడు. 'అయ్యో దేవుడా! నాకేమీ తెలియదు. పిల్ల తెలియకచేసింది క్షమించండి' అన్నది తల్లి.

'సరే ఈసారికి నిన్ను వదుల్తాను. ఇకమీద నీపిల్లని పొట్టకు కరచుకునే వుండాలి. దాన్ని వదిలినా సరే, అది నీకు తెలియకుండా దిగినా సరే నీపిల్ల నిన్ను చంపును గాక!' అని శాపమిచ్చేడు. ఆ శాపానికి భయపడి ఏడ్చింది తల్లికోతి. దాన్ని అతిజాగ్రత్తగా పొట్టకు కట్టుకొని తిరిగేది."

మధ్యలో... "కోతులకు కూడా శాపాలు-కోపాలూనా?" అన్నాను నేను.

"ఏం మన పూర్వీకులు శాపాలివ్వలేదా? అలాగే ఇవీను. ఇంకా ఆ ఒక్క కోతికేగాదు ఆశాపం. ఏ కోతికి అయినా సరే ఆ శాపం తగుల్తుంది. అంచేత అన్నికోతులు బహు జాగ్రత్తగా తమ పిల్లల్ని పొట్టకు కరచుకునేవి. ఆ భయం అంటే ఏమిటీ - పిల్లగనక తల్లికి తెలియకుండా కిందకు జారిందంటే దానిచేత తల్లి చస్తుంది. అంచేతనే అవి నేటికికూడా పిల్లని పొట్టకు కరుచుకు తిరుగుతాయి.

అందుకనే - పిల్లకు తల్లి పొట్ట పట్టుచిక్కాలని దాని శరీరమంతా దట్టంగా బొచ్చు పెంచాడు దేవుడు. దేవుడికి కోతులొకప్పు డపకారం చేసినా చూసేవా ఎంత మేలు చేసేడో?

ఇంకోటికూడా - తల్లి, పిల్ల కోతిని మోసుకు పోతూంటుంద నుకో. పిల్ల తల్లికి తెలియకుండా కిందకు దిగిందంటే తన ప్రాణానికే హాని కలుతుందని ఆ తల్లి కోతి, పిల్ల పీక నొక్కేసి, చంపి, అది శవమై బొమికలు మిగిలేదాకా వెంట పెట్టుకు తిరుగుతుంది. ఆ తర్వాత వదిలేస్తుంది. నే చెప్పిన ఈ మూడు గుర్తులు నువ్వు చూస్తూనే వుంటావుగా?' అని నన్నడిగింది అక్క.

'ఓ ఈ మూడు నేను రోజూ చూస్తూ వుండేవే' అన్నాను.

"అయితే నాకథ రైటు" అన్నది. ఇంతలోకే అమ్మ మొక్కజొన్న పొత్తులు కాల్చి తీసుకువచ్చింది. అమ్మ నాన్నగారికి మాత్రం ఓ నాలుగు దాచింది. మిగతావన్నీ మేమే తిన్నాము.


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్నయెడల వెంటనే

పాత్రుడుగారి

# బాల సంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు :—

## డా॥ పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,

11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి :
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి :
నెం. 15, పుగళై పిళ్ళై వీధి,
తెప్పకొలం.

# రైతు తెలివి

రచన : "గోనార్కలీ"

ఒకడూరిలో భోరున వర్షం పడుతోంది! అందులో ఒకరైతు ఇల్లు కన్నాల బొంత! ఇల్లంతా కారుతోంది! పాపం రైతు తడుస్తూ ఒకమూల నక్కిఉన్నాడు. ఒకాయన అదిచూసి :

"ఏమయ్యా! ఇల్లు నేయించుకోరాదూ! అలా తడిసేకంటే!" అని అన్నాడు.

"ఇప్పుడెలా బాబూ వర్షం పడతాఉంటే," అని జవాబిచ్చాడు రైతు!

* * *

ఎండాకాలం వచ్చింది! తిరుగా ఆ రైతును ఈయనవచ్చి ఇల్లు నేయించుకో మన్నాడు.

"బాబూ! ఇది వర్షాకాలం కాదుగా! డబ్బు దండక్కిగాని ఎందుకు బాబూ?" అన్నాడు తన తెలివికి మురిసిపోతూ రైతు సోదరుడు!


## జాబ్కో వస్తువులు

అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి — సబ్బులు, నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్కోవారే తయారుచేస్తున్నారు. మీరు స్వదేశీవస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా? జాబ్కో మార్కుగల వస్తువులే, అన్నిటికంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీనే కొనుడు. జాబ్కోనే కొనుడు.

★

మేము తయారుచేయు వస్తువులు:

హేర్ గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె, లైంగ్లిస్, హేర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

★

జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్నాకులం.




9 8 7 6 5 4 3 2 1 – ఈ వరుస అంకెల
1 2 3 4 5 6 7 8 9 – తిరగవేసి

8 6 4 1 9 7 5 3 2 – తీసివేయగా
2 3 5 7 9 1 4 6 8 – అవి తిరగవేసి

6 2 8 4 0 6 0 6 4 – తీసివేయగా
4 6 0 6 0 4 8 2 6 – తిరగవేసి

1 6 7 8 0 1 2 3 8 – తీసివేయగా
8 3 2 1 0 8 7 6 1 – తిరగవేసి

9 9 9 9 0 9 9 9 9 – కలపగా
9 9 9 9 0 9 9 9 9 – తిరగవేసి

0 0 0 0 0 0 0 0 0 – తీసి వేయుము

సంపాదన: "మరణాజీ" (విజయనగరం)

# బాల ఎవరు

బాల దేశం
భారత దేశం
బాల పట్నం
బ్రహ్మ పట్నం

●

బాల రూపం
బ్రహ్మ రూపం
బాల వాక్యం
బ్రహ్మ వాక్యం

●

బాల ఎవరు
బ్రహ్మ పుత్రి
బ్రహ్మ ఎవరు
విశ్వ కర్మ

రచన : బాలకవి దంటు కృష్ణమూర్తి.


# పిల్లలూ!

మంచి బాగా చేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి. జాబ్‌కో ఫౌంట్ ఇంక్ తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నారనుకుంటాను. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.




## జాబ్‌కో ఫౌంట్ ఇంక్

ఇండియాలో మంచిది.

★

జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.

# ★ మసిబొగ్గులు -

ఏమిటీ యీ బొగ్గులు, నల్లగా, అసహ్యంగాను చేతికి మసి అవుతూ అని మనం చీదరించుకుంటాం. కాని యీ బొగ్గులు మనకు ఎంత ఉపకారము చేస్తున్నాయో మీకు తెలుసా? ఆకలి అవుతో వుంటుంది. స్కూలుకి వేళ అవుతోందని తొందర పడుతూవుంటాం. అప్పుడు ఎవరో ఒకరు కాసిన్ని బొగ్గులు కుంపట్లో వేసి! మంట చేస్తే, నల్లటి బొగ్గులు ఎర్రటి నిప్పు లయ్యేటప్పటికి, అన్నం కుతకుతలాడుతుంది. ఇది మనకు తెలిసిన విషయమే. కొంతమంది బొగ్గు పొడుముతో ప్రొద్దున్నే పళ్లు తోముకుంటారు. ఇది మీరు చూసే యుంటారు.

బొగ్గుల్లో చాలా రకాలున్నాయి. ముఖ్యంగా మనం చూసేవి కర్రబొగ్గులు. వంట ఇంటిలో రోజూ మనం చూస్తూనే వుంటాం. మనం రైల్లో ప్రయాణం చేస్తూవుంటాం, రైలుముందుకి పోతూవుంటే, ఎంచక్కా వెనక్కి పరుగెత్తే చెట్లను రైలు కిటికీలోంచి తొంగిచూస్తే, కళ్లల్లోకి వచ్చి పడతాయి, బొగ్గు నెరుసులు- ఓర్వలేనితనం, రాక్షస గుణం! వీటినే రాక్షసి బొగ్గులంటాం. రైలు ఇంజను దగ్గర, స్టేషనులోను కనబడతాయి. ఈ రాక్షసి బొగ్గులు గనులల్లో దొరుకుతాయి. ఈ బొగ్గులు మూలంగానే రైలుబండి పరుగెడుతుంది.

గ్రాఫైటు అనే బొగ్గుకూడా గనులలోనే వుంటుంది. మనం రోజూ వ్రాసుకొనే పెన్సిళ్ళు ఈ బొగ్గుతోనే తయారుచేస్తారు.

మొన్న మొన్నయిన యుద్ధం గురించి మీకందరికీ తెలుసును. జర్మనీదేశానికి నియంత అయిన హిట్లరు ప్రపంచకం అంతా జయించి కులుకుదామని బయల్దేరాడు యుద్ధానికి. అప్పుడు ఇంగ్లాండు, అమెరికా, రష్యా మొదలైన దేశాలవారంతా కలసి, హిట్లర్ని ఓడించారు. ఆ యుద్ధంలో, విమానాలు, టాం

# మాయబొగ్గులు ★

కులు, కార్లు నడపడానికి బోలెడు పెట్రోలు కావలసి వచ్చింది. ఉన్న పెట్రోలంతా యుద్ధమే మింగేసింది. మన బస్సులు కార్లకి యింక పెట్రోలు ఏదీ? అప్పుడు బొగ్గుతో కార్లని నడపడం మొదలెట్టారు. ప్రత్యేకంగా కర్రలను కాల్చి బొగ్గులను తయారుచేసేవారు. పెద్దబొగ్గు పొయ్యిలు బస్సు వెనక్కాల కట్టేవారు. ఆ బొగ్గులు మండినప్పుడు ఒక విధమైన వాయువు (గేస్) పుట్టుతుంది. దానివల్ల బస్సులు నడుస్తాయి. ఇప్పుడుకూడా అక్కడక్కడ బొగ్గు కార్లను చూస్తూనే వున్నాం.


పూర్వము ఎలక్ట్రిక్ దీపాలు లేనప్పుడు, ఇంగ్లాండు దేశంలో కోల్ గేస్‌తో దీపాలు వెలిగించుకొనేవారు. రాక్షసి బొగ్గు (కోల్) ను వేడిచేస్తే కోల్ గేస్ తయారవుతుంది.

ఇంటి తలుపులు, కిటికీ తలుపులు కర్ర సామానులు చెడపట్టకుండా తారును పూస్తాం. రాక్షసి బొగ్గునుంచే తారు మనకి వస్తోంది. రాక్షసి బొగ్గులను వేడిచేసి యంత్రాలు మూలంగా తారును సంపాదిస్తారు. నల్లగా వుండే బొగ్గుల్లోంచి, నల్లటి తారు పుట్టింది. ఆ నల్లగా అసహ్యంగా వుండే తారునుంచి, తెల్లటి కలరావుండల (నేప్తలీనుబాల్స్)ను తయారుచేస్తారు. బట్టల పెట్టెల్లోకి చిమ్మెటలు, పురుగులు రాకుండా కలరావుండల్ని పెట్టెల్లో వేస్తాం.

చక్రవర్తులు, రాజులు పెట్టుకొనే ఖరీదుగల వజ్రాలు బొగ్గు జాతిలో చేరినవే! వజ్రంకూడా ఒక రకమైన బొగ్గు. ఒక విధమైన బొగ్గుతో మాయవజ్రాల్ని తయారుచేస్తారు. ఇటువంటి వజ్రాలతోనే అద్దాల్ని కోస్తారు.

చూసారా! పెంటమీద వుండేవీ బొగ్గులే! రాజుల రత్నాల కిరీటాలమీద నుండేవీ బొగ్గులే!!

రచన: డి. శ్రీనివాసరావు, మద్రాసు.



# బాలసేన [illegible]

రచయిత ; "సూరిశెట్టన్నాయ్" (అనకాపల్లి)

బారవీరలెమ్మురా!
బాలసేన మనదిరా!!
ఖడ్గము ధరియించరా
బల్లెము చేబూనరా
కదంతొక్కి, పదంపాడి
యుద్ధమునం దురుకరా! ॥బాల॥

అమ్మకు స్వాతంత్ర్యమో—
అసువుల నర్పించుటో—
నేతాజీ మాటలనే
అనుసరించి తీరుదాం,
మనదేశమునందలి పర
రాజుల దునుమాడుదాం,
శత్రులు చెండాడుదాం. ॥బాల॥

ప్రాణమైన పోవనీ
పట్టుబట్టి గెలుచుదాం
వీరాభిమన్యునివలె
వీరతచూపించుదాం
ధీరత చూపించుదాం
భారతమాతకు జైయని
భేరీ మ్రోగించుదాం ॥బాల॥

—జైహింద్!

# ★ అంగ భాష ★

పింగి ల్లంగ లూంగు మీంగి కుంగు యీంగి భాంగ షంగ వంగ చ్చుంగు నాంగ? నాంగ కుంగు బాంగ గంగ వంగ చ్చుంగు నుంగు. నేంగే నుంగు యీంగి భాంగ షంగ గంగ బంగ గంగ బంగ మాంగ ట్లాంగ డంగ గంగ లంగ నుంగు.

మీంగి రుంగు కూంగు డంగ నేంగే ర్చుంగు కుంగు టాంగ రాంగ?

రంగ చంగ నంగ: పుంగు లంగ పాంగ కంగ వెంగె కంగ టంగ రంగ మంగ ణంగ. కాంగ కింగి నాంగ డంగ. వంగ యంగ స్సుంగు పంగ దంగ కొంగో డుంగు.


## బీటాకాఫిన్




అన్ని నొప్పులకు, జ్వరములకు

రా మ బా ణ ము

3 బిళ్లల పొట్లము ఖరీదు 1 అణా.


అన్ని మందుల దుకాణములలో విక్రయించబడును.

వాడేవిధానము పొట్లములో యుండును.

తయారుచేయువారు :

B. T. M. Co., Post Box 2092, Bombay 2.

పిల్లల కొక నాటిక :




[రంగం: భానుమతి ఇంట్లో - జల్తారుమనిషిదగ్గర చిన్న నేతిగిన్నె కొందామని జల్తారుకోసం భానుమతి వెతుకుతూ వుంటుంది.]

---

భానుమతి:-(ఇంట్లోఉన్న సామానంతా చిందరవందరగా పడేస్తూ) అబ్బ! ఇష్షూ! దిక్కుమాలింది ఎక్కడుందో తెలియదు! ఇల్లంతా గాలించడమైంది!

జలతారు మనిషి:-ఏమమ్మోవ్! మీ బేరంతో కడుపు నిండినట్లే! గంటసేపైంది ఇక్కడ నిలబడి...మీ జల్తారు మరో కళ్లకి అమ్మండి...నే నెళ్ళిపోతున్నా!

భాను:-(విసుగ్గా) ఉండవోయ్! గుర్రం కాస్త దిగు! ఏమిటా తొందర! ఇంతసేపూ సతమతం పడుతూన్నది నీకోసమేగా!

(ఇంతలోకీ చంటిపిల్ల కాదామ రెత్తినట్లు ఏడుస్తూంది)

అమ్మతల్లి లేచావమ్మా!... గంగానమ్మలాగ ఎందుకంత ఏడుపు!...మాయజల్తారుండ ఎక్కడెట్టానో కనిపించదు గదా!...గూళ్ళన్నీ వెదికాను...పెట్టెలన్నీ బోర్లించాను! మాయామతి!

బంట్రోతు కుర్రాడు:-అమ్మగోరూ!...అమ్మగోరూ!

భాను:-ఆఁ! వస్తున్నా నాయనా! అప్పుడే తయారయ్యావూ కాఫీ పట్టుకెళ్ళేందుకు!... గొంతుకలో మెతుకులు అలానే ఉంటాయి, అంతలోకే ఆయనకి కాఫీ అప్పుడే కావాలి! (పిల్ల గుక్కపెట్టి యేడుస్తుంది) ఏడవకే నా తల్లీ!...అందరూ నా ప్రాణాలు కొరికేవాళ్లే...ఆఖరికి ఈ మాయజల్తారుండకికూడా నేను లోకువైపోయాను కామోసు!

బంట్రోతుకుర్రాడు:-అమ్మగోరు!

యెవరో యిద్దరు నేవితు లొచ్చారంటండీ,మరోరెండు కప్పుల కాఫీ ఎగస్ట్రాగా తెమ్మన్నారండి!

భాను:-(విసుగుతో) ఆ! తెమ్మంటారు! తెమ్మనకే! తేరగా చేసి పెడుతూంటే, మోయి మాయితీలకేం లోటులేదు... నిప్పార్పేశాను! నేను మళ్ళీ కాఫీ చేయలేను... అదుగో ఆ ఫ్లాస్కులో కాఫీ ఉంది. అది పట్టికెళ్ళి ఆ స్నేహితులిద్దరికీ ఇచ్చి ఆయన్నేమో హోటల్లో తాగమను... మాయచాకిరీ కాదుగాని, ఎముకలు చిట్లం కట్టిపోతున్నాయి బాబు!

బంట్రోతు కుర్రా:-అమ్మగోరూ! ఏంటండి యెతుకుతున్నారు!

భాను:-నీ కెందుకురా ఫో!

బంట్రోతు కుర్రాడు:-నాను కూడా కాస్త...కావలిస్తే సెయ్యి సాయం...

భాను:-నాకేమీ అక్కర్లేదు... వెళ్ళు...అదుగో ఫ్లాస్కు.

బిచ్చగాడు:-కళ్లు కాళ్లూ లేవు నారాయణా!

చూడ కళ్లూ లేవునారాయణా! అమ్మా అన్నపూర్ణీ! పట్టెడు ముద్దమ్మా!

భాను:-అబ్బబ్బా! ఈమాయసం డెక్కడొచ్చి పడిందోయి భగవంతుడా! ఏదీగానీ వేళ బిచ్చమేమిట్రా! పో!పోవేం! చెబుతూంటేను! చేతులూరుకోలేదు వెళ్ళు!

జల్తారు మనిషి:-ఏమమ్మోవు! ఈ యాళ ఇక్కడే పొద్దుగూకేట్లుంది!...నీ జల్తారు నీదగ్గరే ఉండనిచ్చుకో! నువ్వు ఊరికే ఇచ్చినా వొద్దమ్మా ఆమాయ జల్తారు!

భాను:-ఇదిగో! అబ్బీ! వ్యాపారం చేసుకునేవాడి లక్షణం ఇది కాదుస్మా! ఆగు! కాస్త ఓపికపట్టు! ఏం నాకేం సరదా నిన్నిక్కడ నిలబెట్టడానికి! ఒక్కనిమిషం ఆగు! ఆ కొయ్యపెట్టె సొరుగులో ఉందేమో చూస్తాను!

(తలుపు కొట్టిన శబ్దం)

వచ్చె! వచ్చె!...(తలుపు తెరిచి) ఓసినీ! నువ్వుటే!

కనకం:-(ఆశ్చర్యంగా) ఇదేమిటిదంతా భానూ! ఇల్లంతా

ఈ గుడ్డ లేమిటి!...అదే మిటే, పరుపులన్నీ కింద పారేశావు! నీ కేమన్నా పూనిందేమిటి భానూ!

భాను:-పూనడంలాగేవుంది! మా ఆయన కండువా జల్తారు తీసి ఉండచుట్టి ఎక్కడో పెట్టాను! జల్తారు మనిషి కేక వినిపిస్తే, పోనీ ఆ జల్తారు ఇచ్చి ఓ నేతి గిన్నె కొందామని... గంటసేపటినుంచి, ఇల్లంతా గాలిస్తున్నా...ఎక్కడా కనిపించదాయిరి...ఓ జల్తారబ్బీ!

జల్తారు మనిషి:-ఏమమ్మా!... దొరికిందా వుండ!

భాను:-వెళ్ళు నాయనా! అదునుకి దొరకని వస్తువంటే ఇదే! దానికి కాళ్ళొచ్చాయనుకుంటాను...ఎక్కడో మాయమైంది!

జల్తారు మనిషి:-మాంచి పనే నమ్మా! మీలాంటి బేరాలొస్తే బువ్వ తిన్నట్టే!... జల్తారు కొంటాం...జల్తారు కొంటాం...జల్తారూ....(వెళ్ళి పోతాడు)

కనకం:-భానూ! అంతమందమతేమిటే! గుర్తుగా వస్తువుల్ని పెట్టుకోవూ!...ఇది సంసారి లక్షణమేనా?

భాను:-ఏం చేయమంటావు కనకం! గుర్తుగా వస్తువుల్ని పెట్టుకుంటే మాత్రం, ఈ ఇంట్లో మనుషులు వుండనిస్తారా!...ఈవేళ జల్తారు కోసం ఈ వెతుకులాట అలావుంచు! ప్రతిరోజూ సాయంత్రం దీపాలు వెలిగించేందుకు అగ్గిపెట్టెకోసం వెతుకులాట గదా! గుర్తుగా, పోపుల పెట్టెలో పెడితే, ఆ సమయానికి అక్కడ వుండదు గదా!

కనకం:-పోపుల పెట్టెని ఎవరు సవరిస్తారు...అంతాసోద్దెంగా మాట్లాడుతావు!

భాను:-ఔను నేను ఏది మాట్లాడినా నీకు సోద్దెంగానే వుంటుంది...ఆయన నిత్యాగ్నిహోత్రులు! ఆచుట్ట, నోట్లో, ఎప్పుడూ, అలా శివుడు మూడో కన్నులా ఎర్రగా వుండవలసిందే! ఎన్ని అగ్గిపెట్టెలున్నా చాలవు...ఇంక మా కుర్రాడు రామానికి

కూడా, తెల్లారిలేస్తే, అగ్గి పెట్టెతోనే పని!...

కనకం:-(నవ్వి) వాడి కెందు కమ్మా!...చుట్టలు కాలుస్తాడా! సిగరెట్లు కాలుస్తాడా!

భాను:-అదొక్కటే తరువాయి!. అదికాదే కనకం! వాడి నాన్న, వాడికో చవకబారు పెన్ కొన్నారు! కొన్నప్ప ణ్ణించీ ఆ పెన్నుకి రిపేరే! అస్తమానం అగ్గిపుల్ల వెలి గించడం, పెన్ని వేడిచేసి పాళీ ఊడదీసి, సానమీద అరగదీయడం - ఇదీ మా రామానికి పని!... వాడి చేతులూ బట్టలూ మొహం చూశావా!...ఉత్త సిరా బుడ్డి!

కనకం:-పోనీ అగ్గిపెట్టి వుంచు కునే స్థలం మార్చు!

భాను:-అయ్యో! నీ వెర్రి! మా ఆయన చూపులూ మా అబ్బాయి చూపులూ, ఆ అగ్గిపెట్టిని అనుసరిస్తూనే ఉంటాయి!

కనకం:-భానూ! జల్తారంటే జ్ఞాపకం వచ్చింది! మొన్న మా ఆయన పాతకోటిచ్చి పప్పు గిన్నె కొన్నందుకు, ఇంట్లో ఎంత హంగామా చేశారనుకున్నావు! "నీకే మన్నా మతి పోయిందా! పాత సామాను కొనడానికి, బట్టలన్నీ, నీకు పాతగానే కనిపిస్తాయి ... రాయిలాంటి కోటు ... గట్టి గుండీలు... రంగు పోయిందంటే...ఈ యుద్ధపు ఎద్దడిరోజుల్లో గుడ్డ లెక్కడొస్తాయనుకున్నావు" అని, తల వాచేలా చివాట్లు పెట్టారే భానూ!

భాను:-ఆజల్తారు కెంతహంగామా జరిగిందనుకున్నావు! ఆ కండు వా, వారి పెళ్ళినాటిదట! పరమపవిత్రమైందట!అబ్బబ్బ! ఆయన అన్నట్టుగానే ఆ జల్తా రుండ కంటికి కనిపించకుండా మాయమైపోయింది.

(తలుపు చప్పుడు)

రామం:-అమ్మా! అమ్మా!

భాను:-వస్తున్నా (తలుపు తెరచి) అయ్యయ్యో! ఆ జేబు చూసుకో! ఎంత సిరామరకో చూశావా?

రామం:-పెన్ను క్యాపు వదులై పోయిందమ్మా!

భాను:-అస్తమానం, అగ్గిపుల్లలు తగలేసి కాలుస్తూంటే, మరి పెన్ పాడవదూ!

రామం:-నా బట్టలన్నీ కిందపారేశావా! (ఏడుస్తాడు)

భాను:-లేదు బాబూ! జల్తారుండకోసం వెతికాను. ఔను కాని - రామం జల్తారుండ నువ్వు తీశావా?

రామం:-రాత్రి, పిన్నిగారబ్బాయిలూ నేనూ వెన్నెలబంతి ఆడుకున్నాం కాదే!

భాను:-(ఆశ్చర్యంతో) జల్తారుండ తోటా! నీ కెక్కడ కనిపించిందిరా! పోనీలే... ఆడితే ఆడారుగాని... ఆ వుండ యేదీ బాబూ?

రామం:-చిట్టి గట్టిగా విసిరేసిందే ...అది ఎక్కడో పడిపోయింది.

భాను:-అయ్యో! ఓ చిన్న నేతి గిన్నె కొందామనుకుంటే ఎంత పని చేశావురా!

రామం:-ఉండమ్మా! మన దొడ్లో ఆ చలవ పందిరి మీదపడిందేమో చూస్తాను!

భాను:-బాబూ! జాగ్రత్తసుమా! పందిరిరాటలు పుచ్చిపోయి ఉన్నాయి...ఏంచెప్పను కనకం! ఇదీ మోస్తరు ఇంట్లో!


రామం:-(పందిరి మీదనుంచి) అమ్మోయి! అమ్మోయి!

భాను:-ఏం నాయనా! దొరికిందా!

రామం:-(నవ్వుతూ) చూడు! నాన్న ఏం చేశారో!


భాను:-అయ్యయ్యో! జలతారంతా ముక్కలు ముక్కలుగా తెంపి, పొట్లపిందెలకి పెంకులు వ్రేలాడతీశారు... ఇంక నేనేం చెయ్యను! ఈ కొంపలో ఇంతే! అదునుకి ఏ వస్తువూ దొరకనూ దొరకదు, పనికిరానూ రాదు!

(ఏ. ఐ. ఆర్. అనుమతితో)



# వావివరుసలు

ఈ దిగువ చదరంలో వావివరుసలుగల 23 గ్గురు బంధువులు వున్నారు. వెళ్లిన గదికి వెళ్లకుండా వరుసగా బంధువులను తెలుసుకో—



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ను | మ | న | ది | ఒ | త్త | అ | కు |
| మ | అ | న్న | అ | న్న | నా | మ | డు |
| డు | క్క | మ | న | మ | మ్మ | మా | కొ |
| కూ | చె | రా | మ | మా | అ | మ్మ | త్త |
| తు | ళ్లి | లు | మే | న | ది | మా | న |
| రు | త | బా | వ | మ | ర | మ్మ | మే |
| కో | మ్ము | డు | తా | త | అ | మ్ము | ది |
| డ | లు | బా | వ | పి | న్ని | మ | ర |


కూర్పు : శిష్టు సుబ్బారావు,
హెడ్మాస్టరు
వేపకాయలపాలెం.




# పొద్దు తిరుగుడుపువ్వు కథ

రచన:
శిష్ట్లా ఉమామహేశ్వరరావు

పూర్వకాలంలో సూర్యభగవాను డొకసారి భూమిమీద సంచారానికై వచ్చాడు. అనేక దేశాలు సంచారంచేసి సూర్యుడు చివరకు తుంగభద్రా తీరాన రంగవల్లీపురం చేరాడు.

రంగవల్లీపురము నేలేరాజు కొక్కతే కూతురు. ఆమె అందమును దేవతలు కూడా వర్ణించలేరు. ఎంత అందకత్తెయో అంత అమాయకురాలు.

ఆ రాజకుమారిని చూడగానే అంతటిసూర్యభగవానునికికూడా ఇష్టం కలిగింది. ''ఓహో! యీ పిల్ల యెంత అందమైనదీ! ఈ పిల్లను పెండ్లాడితే బాగుండునే!'' అనుకున్నాడు సూర్యుడు. ఆమె పూదోటలో చలవరాతిమీద కూర్చుని పువ్వులు గుచ్చుకుంటుంటే ఎదట నుంచున్నాడు.

''సుకుమారీ! నేను సూర్యుణ్ని. ప్రపంచం అంతటికీ వెలుతురిచ్చేవాణ్ని. పెండ్లాడుతావా?'' అన్నాడు.

ఆ సుకుమారికి సిగ్గువేసింది. తలిదండ్రులను విడిచి పోవడాని కామె కిష్టంలేదు.

ఆమె తండ్రి రంగవల్లీపురం రాజధానిగా తుంగభద్రా తీరాన్నంతా యేలుతున్నాడు. ఆమెకు చక్కని అంతఃపురం కట్టించి యిచ్చాడు. కుమారుణ్ని చూచి

నట్లు చూస్తున్నాడు. ఆమె కింకేం కావాలీ.

తండ్రి ఇచ్చిన అంతఃపురంలో వజ్రాలదీప మెప్పుడూ వేలాడు తూంటుంది. గోడలన్నిటికీ అంతంత ఎత్తున అద్దాలున్నాయి.

అంతఃపురంలో నేలలమీద పరవడానికి చెంచుకన్నె లామెకెన్నోతివాసీలు నేసిఇచ్చారు.

ఆమె పూదోటలోని తేనెటీగెలతోనూ, రకరకాల పూలతోను, ఉడుతలతోనూ, చక్కని పిట్టలతోనూ, చాలకాలంనుంచీ స్నేహంగా వుంటూంది. అవ్వన్నీ విడిచిపోవడాని కామెకు మనస్సు కలగలేదు.

అయితే పాపం ఆ రోజునే ఆమెతండ్రి నదీతీరాననే అడివిలోకి వేటకై పోయాడు.

ఇంట ఒంటరిగావున్నది రాజకుమారి.

సూర్యుడు మళ్లీమళ్లీ దీనంగా అడిగాడు. చివరకామెభయపడి పరుగెత్త నారంభించింది.

నదీతీరాన్నే పరుగెత్తింది రాజకుమారి. తండ్రి కనబడకపోతాడా అనుకుంది.

సూర్యుడు భగవానుడాయెను. బలవంతుడుకాడూ? ఆమె వెంటబడి పరుగెత్తుతూ దగ్గిరిస్తున్నాడు. "సుకుమారీ! సౌభాగ్యవతీ! సుందరీ! నన్ను పెండ్లాడు. అనంతైశ్వర్యాలు ఇస్తాను. ఆకాశాన అంతఃపురం కట్టిస్తాను!" అంటూ పరుగెత్తాడు సూర్యుడు.

అప్పటికీ ఆమెకు ఇష్టం కలగలేదు. అతడు దగ్గిరిస్తున్నకొద్దీ భయమెక్కువైంది. చివరకు "తండ్రీ నన్ను రక్షించు!" అని పెద్దపెట్టున కేకవేసింది.

దూరానున్న ఆ రాజకుమారి తండ్రి యీకేక విన్నాడు. వెంటనే రావడానికెలా! అందుచేత ఆమెను ఆ నదీతీరాన ఒక పూమొక్కగా మారేట్లు చేశాడు.

నిట్టూర్పు విడుస్తూ ముఖం ఎర్రనవగా సూర్యుడు అక్కడే నిలబడ్డాడు. "నన్ను పెండ్లాడలేదు గాదూ! పూమొక్కవైనావా? సరే, నేను ఎటుతిరిగితే నీవు గూడా అటే తిరుగుతూండు. పోనీ పొద్దస్తమానం నీ ముఖం చూస్తూ ఐనా సంతోషిస్తూంటాను" అని అంతర్ధానమైపోయాడు.

ఆపూవుకి అందుకనే పొద్దుతిరుగుడుపూవని పేరుకలిగిందట!



# పుట్టలో పాలు !


అమ్మాయిలూ!

అబ్బాయిలూ !!

నాగులచవితి వస్తోంది. చాలా మంది పుట్టలో పాలుపోస్తారు. ఇది పూర్వంనుంచీ వస్తూవున్న ఒక ఆచారం. అంతే.

అగుగో! ఆ పుట్టలోని నాగుపాము ఏమంటుందో తెలుసా? "ఓ! హిందువులారా! ఏదో పిచ్చినమ్మకాన్ని బట్టి మీరు ఎన్నో కుంచముల పాలు మా పుట్టల్లో పోస్తున్నారు. పాలు మాత్రమేకాక, యింకా పప్పు, పిండీ వగైరాలెన్నో మట్టిపుట్టలో పోస్తున్నారు. అవన్నీ మా నోళ్లలో పడతాయా? ఒకవైపు తిండికిలేక ప్రజలు మలమల మాడుతున్నారు! త్రాగుటకు పాలులేక పిల్లలు ఎండిపోతున్నారు. ఈపాలు మట్టిలో కలిపే బదులు, ఆ పిల్లల నోట్లో పోయరాదూ? లెండి! ఆహారపదార్థాలు ఇలాగ పాడుచేయకండి. మీ ఆంధ్రదేశంలో అనేకమంది బీదవారు తిండికిలేక "అన్నమో! రామచంద్రా!" అని కేకలేస్తున్నారు. వారికి అన్నదానం చేయండి! వారికి పాలు ఇయ్యండి. పుట్టల్లోపోసి పాడు చేయకండి!"

రచన: జిట్టా భాస్కరరావు,
6-వ ఫారం, బాపట్ల.



# మట్టిని బంగారముచేయడం!

అబ్బాయిలు!

అమ్మాయిలు!!

మీకు మట్టిని బంగారము చేయడం తెల్సా? పోనీ, మీకు తెలియకపోతే నే చెప్తావినండి!

మన తాతముత్తాతల కాలంలో ఒకరాజు ఉండేవాడట. ఒకనాడు, ఆ రాజువద్దకు ఒక సన్యాసివచ్చి, తాను వెండిని బంగారముగ మారుస్తానని చెప్పేడు! డబ్బు అంటే ఎవరికి ఆశ ఉండదు! "సరే"నని రాజు ఒప్పుకొన్నాడు. సన్యాసికొక వసతిగృహం ఊరు అవతల ఇచ్చి, రోజు, వెండి పంపుతూ యుండేవాడు. ఇలాగ కొంతకాలం గడచింది.

ఒకరోజున మంత్రి "ఆ వెండిని రోజు ఎక్కడకు పంపుచున్నారని" రాజు నడగితే "బంగారముగా చేయించడానికి ఊరవతలనున్న సన్న్యాసివద్దకు పంపుతున్నా" నని చిఱునవ్వుతో చెప్పేడు రాజు.

"రాజా! మట్టినే బంగారముగా చేయగలవారు మనరాజ్యములోయుండగా, ఎవరో సన్యాసిచే వెండిని బంగారముగ చేయించనేల!" అని చలోక్తిగా మంత్రి చెపుతూనవ్వాడు. మంత్రి మాటవినగానే రాజుకు ఎక్కడలేని సంతోషం, ఆశ, ఎక్కువైపోయాయి. వెంటనే మట్టి బంగారముగా చేస్తాడన్నవాడిని పిలిపించి "ఎట్లు చేస్తావు" అని అడిగేడు.

అతడు రాజుతో ఇల్లాగన్నాడు: నేను మట్టినితెచ్చి కుండలను చేసి, వాటిని అమ్మి, వచ్చిన డబ్బును మితముగా ఖర్చుపెట్టి, నా పెండ్లాము పిల్లలకు బంగారు నగలు కొందును. ఇదియే బంగారముచేయు పద్ధతి."

ఆశ్చర్యం— తెలివి తక్కువ, ఒకసారిగ రాజును చుట్టిముట్టివేసేయి. దించిన మొఖం ఎత్తలేక పోయాడారాజు.

ఇక సన్యాసిసంగతిచూద్దాం! ఈ లోపుగానే సన్యాసి కీవార్త తెలిసి "జే పరమేశ్వరా!" అంటూ కాళ్లకు బుద్ధిచెప్పేడు! రాజుకి మరింత సిగ్గయిపోయింది.

రచన: పి. వీరాచారి, రాజమండ్రి.

# కొంటె కిష్టయ్య ★

రచన: డి. ధనంజయ, 3-వ ఫారం.
డి. తిమ్మేశ్వర్రావు, 1-వ ఫారం.

క్రిష్టయ్య చాలా కొంటెవాడు. ఇంతా అంతా అల్లరికాదు. ఎంతో తెలివైనవాడుకూడాను. ఊళ్లోవాళ్లనీ, స్కూలుపిల్లల్నీ, మేష్టర్నీ ఏడిపిస్తాడు. అల్లరి చేసినాసరే కిష్టయ్య అంటే అందరికీ ఎంతో యిష్టం.

ఒకసారి స్కూలులోకి ఇనస్పెక్టరుగారు వచ్చారు. ఒక నోటి లెక్క యిచ్చారు. గుర్రపుపందెంలో ఒక గుర్రం నిముషానికీ ఒకటిన్నరమైళ్లు పరిగెత్తితే అయిదున్నరనిమిషాలలో ఎంతదూరం పరుగెత్తుతుంది అని అడిగారు.

అందరూ వాళ్లకి తోచిన జవాబులుచెప్పారు. తప్పినవాళ్లని యినస్పెక్టరుగారు ఒకదెబ్బకొట్టుతానని చెప్పారు. కిష్టయ్యకి భయంవేసింది. ఎల్లా తప్పించుకోవటమా అనుకొన్నాడు. ఇనస్పెక్టరు కిష్టయ్యని అడిగాడు. కిష్టయ్య మాట్లాడలేదు. మళ్ళీ అడిగాడు. మళ్ళీ మాట్లాడలేదు. ఇనస్పెక్టరు కోప్పడి 'జవాబు చెప్పు' అని కేకలేశారు.

"అయ్యా! మానాన్న గుర్రపుపందెం పాపం అని చెప్పాడు. అటువంటి విషయంలో నేను ఏమీ సంబంధం పెట్టుకోను. అడిగినందుకు మీకూ, చెప్పినందుకు నాకూ పాపం వస్తుంది." అని కిష్టయ్య అన్నాడు. దాంతోటి మేష్టారూ పిల్లలూ పక్కున నవ్వారు. ఇనస్పెక్టరుగారుకూడా నవ్వి ఊరుకున్నారు.



# రావోయి జాబిల్లి!

## "చిట్టిపాపకు"



రచన : బొడ్డుపల్లి పురుషోత్తము

రావోయి జాబిల్లి
రావోయి జాబిల్లి
పాప ఏడుస్తుంది
రావోయి జాబిల్లి !!

మబ్బుల్లో దాగావు
మాయమైపోయావు
ఎందాక రావంచు
గోలెట్టిపోతుంది ॥రా॥

బుజ్జిపాపాయితో
ముచ్చట్లు చెప్పితే
ముత్యాలముద్దులు
మూటగట్టిస్తుంది. ॥రా॥

నిన్ను జూచేదాక
నిద్రపోనంటుంది
నీవు వచ్చేదాక
బువ్వ తిన్నంటుంది. ॥రా॥

ఎంత లాలించినా
ఎంత బోధించినా
తాను పట్టినపట్టు
తప్పదంటుందోయి. ॥రా॥

నీ పేరుచెప్పితే
చిఱునవ్వు నవ్వింది
ఉట్టుట్టిమాటలకు
గట్టి పట్టెట్టింది. ॥రా॥

పాపాయి నోమారు
పలుకరించావంటె
వరహాల నవ్వులు
వలసినన్నిస్తుంది. ॥రా॥

పసిపాప దృష్టిలో
పదిమంది కనబడ్డ
నిన్ను జూచేదాక
నిలువకేడుస్తుంది. ॥రా॥

ప్రేమార్తులకెగాక
ప్రేమస్వరూపులకు
నీవంటి జాబిల్లి !
నిలువెల్ల అమృతమె. ॥రా॥

# బాల పెళ్లి

రచన: శ్రీమాన్ రాఘవాచార్య
తెలుగుపండితులు S. K. D. P. పాఠశాల, మద్రాసు.

కొబ్బరికాయలు, అరటిపండ్లు, గుట్టలు గుట్టలుగా ఇంట్లో చూచి "ఇవన్నీ ఎందుకే అమ్మా" అని అడిగింది చిట్టిబాల సరోజ.

సరోజకు ఆరో ఏడు. "బాల సంఘసభ్యులం" అని ఇంట్లో ఎప్పుడూ పాడుతూ వుంటుంది. చదవడం రాకపోయినా, బాల పత్రిక రాగానే ఎవరికీ యివ్వకుండా బొమ్మలు చూస్తూ కూర్చుంటుంది. ప్రయివేటు మాస్టారు వస్తే దాక్కుంటుంది. పిల్లలు ఆడుకోవడానికి వస్తే ఎదురెడుతుంది.

"అక్కయ్య పెళ్లి" అని అమ్మ చెప్పగానే బాలకి తెలిసింది కాదు. "పెళ్ళి అంటే ఏమిటి? అక్కయ్యకి చేస్తే నాకో!, ఇంట్లో తినడానికి చేస్తే అక్కకి నాకు సమానంగా పెడతారుకదా! పెళ్ళి అక్కయ్యకే చెయ్యడమే? నాకు కూడా ఎందుకు చెయ్యకూడదు?"

మొదలే పెంకిపిల్ల. సందు దొరికింది. అమ్మదగ్గరికి వెళ్లింది.

అమ్మా! అక్కయ్యకి పెళ్లి చేస్తావు కాని నా కెందుకు చెయ్యవే? నాకుకూడా చెయ్యకపోతే నే నూరుకోను. అని మారాం చెయ్యడం మొదలు పెట్టింది.

"నీకుకూడా చేస్తాలే" అమ్మ అంది.

"ఎప్పుడు?" అంది ఆశతో బాల.

"పాఠంచదవనప్పుడు, ఇంట్లో అల్లరి చేసినప్పుడు, చెప్పినమాట విననప్పుడు." అంది అమ్మ.

"ఓం అయితే సరే! ఈవాళ నుంచి పాఠం చదవను, అల్లరి

చేస్తాను, చెప్పినమాట వినను, నాకుకూడా పెళ్ళి చెయ్యవే అమ్మా'' అంది బాల.

అమ్మ పని తొందరలో వెళ్ళిపోయింది.

''నాకు పెళ్ళవుతుందే కమలా! నాకు పెళ్ళవుతుందే విమలా! నాకు పెళ్ళవుతుందే కల్పకం!'' అని అందరితో చెప్పేసింది.

౨

పెళ్ళి అంటే ఏమిటి? ఏమీ తెలియలేదు. అక్కయ్యను అడుగుదామనుకొంది. ''అక్కయ్యా! పెళ్ళి అంటే ఏమిటే?''

''ఛా ముండా!'' అన్నది సిగ్గుతో అక్కయ్య. బాలకి కోపం వచ్చేసింది.

''నన్ను ముండా అంటావే? నువ్వే ముండవి. పదిసార్లు ముండవి. వందసార్లు ముండవి.'' అని వేలు విరిచింది.

అక్కయ్యకు కోపం వచ్చి అమ్మతో చెప్పింది. అమ్మకి కోపం వచ్చింది. ''పెళ్ళికూతురును ముండా అంటావా! పెంకి ముండా'' అని వీపుమీద చరిచింది.

''అయితే నాకుకూడా పెళ్ళి చేస్తా నన్నావుగా! నన్ను ముండా'' అని ఎందుకనాలి? అంది ఏడుస్తూ బాల.

''నీకు పెళ్లి కావాలా! ఇదుగో పెళ్లిచేస్తా''నని మరొకటి వేసింది అమ్మ కోపంతో. ''అయిందా పెళ్ళి'' అంది అక్కయ్య.

పెళ్ళి అంటే వీపుమీద చరవటమా! అక్కయ్యను కూడా యిల్లాగే కొడ్తారు కాబోలు, నాకు పెళ్లొద్దు బాబూ. నేను పెళ్ళి చేసుకోనే చేసుకోను అనుకుంది బాల.

''నేను పెళ్ళి చేసుకోను'' అని చెప్పేసింది అందరితో.

''అక్కయ్యకి పెళ్ళయితే బావ వస్తాడు. బావను ఉడికించాలి'' అంది పెద్దక్క.

ఏమని ఉడికించాలి.

''ఒకపాట చెప్తాను. ఆపాట పాడితే బావకు ఉడుకుబోతుతనం వస్తుంది.'' అంది పెద్దక్క.

బావా, బావా, పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
సులకామంచం వేశారు
సూరూ గుద్దులు గుద్దేరు
పట్టెమంచం వేశారు
పాతిక గుద్దులు గుద్దేరు

అని చెప్పింది అక్కయ్య.

అక్కడినుంచి "బావా! బావా! పన్నీరు" అని పాడడం మొదలుపెట్టింది బాల.

3

పెళ్ళివారొచ్చారు. అక్క, బావ, పీటలమీద కూర్చున్నారు. అక్క మెడలో బావ ఏదో కట్టాడు. బియ్యం తలమీద పోసుకుంటూంటే చిత్రంగా వుంది బాలకు.

"అదేమిటి? బావ తొందరగా పోస్తుంటే, అక్కయ్య మెల్లగా పోస్తుంది. నేనైతేనా పళ్ళెంతో పోద్దును" అనుకుంది బాల.

పెళ్లి అయిపోయింది. బావ ఒక్కడూ మంచంమీద కూర్చున్నాడు. సమయం దొరికింది.

"బావా బావా పన్నీరు,
బావను పట్టుకు తన్నేరు"

పాట పాడింది. బావ బాలను ఎత్తుకొని ముద్దుపెట్టుకున్నాడు.

"బావా! అక్కని పెళ్ళిచేసుకున్నావుకదా! నన్నుకూడా చేసుకుంటావా!" అంది ముద్దుగా బాల.

"ఓఁ తప్పకుండా చేసుకుంటాను."

"అయితే వీపుమీద చరుస్తావేమొ!"

"అబ్బే కొట్టనే కొట్టను"

సంతోషంతో అమ్మదగ్గరకు వెళ్ళి "అమ్మా! బావ నన్ను కూడా పెళ్ళి చేసుకుంటాడుట. ముద్దు పెట్టుకున్నాడు కూడానే" అంది బాల.

"అయితే చేసుకో! ఇంకేం. మంచి మొగుడు దొరికాడు. ఎక్కడా లేక పోతే అక్క మొగుడే గతి" అంది నవ్వుతూ అమ్మ.

"బావ నన్ను పెళ్లాడతాడు. ముద్దెట్టుకున్నాడు. బావనే పెళ్లాడుతా" అని అందరితో చెప్పేసింది.

# దంతాలు


అబ్బాయి దంతాలు గవ్వల్ల వరుస
అమ్మాయి దంతాలు ముత్యాల వరుస
సీమ సున్నముతోడ తోము దంతాలు
చీకట్లో వెలుగు వజ్రాల దంతాలు
బొగ్గుల పొడితోడ తోము దంతాలు
బొడ్డు మల్లెల తెలుపు బోలు దంతాలు
కాగు పుల్లలతోడ దోము దంతాలు
కలువ పువ్వుల తెలుపు బోలు దంతాలు
అబ్బాయి అమ్మాయి అతిశ్రద్ధగాను
దంతాలు చక్కగా తోముకొంటారు.

రచన : డాక్టరు పోలాకి శ్రీనివాసరావు,
(బూరవెల్లి)



[ఆరోగ్యవాచకము నుండి]

## ఏమిటీ అంకెలు?



పెన్సిలు తీసికొని ఒకటినుండి ప్రారంభించి వరుసగా చుక్కలను చక్కనిగీతలతో కలుపుము.

యం. వి. లక్ష్మి. బాలికాపాఠశాల. కదిరి.

# ★ రొట్టెలో సవర్లు! ★

పూర్వం ఆవూళ్లో ఓపెద్ద కరువు వచ్చింది. జనులు కూడూ గుడ్డా లేక ఆకలికి అల్లాడి పోతున్నారు.

ఆవూళ్లో ఓ జమీందారు. ఆయన చాలా భాగ్యవంతుడూ, బుద్ధిమంతుడూను, అంచేత ఆయన బీదలకష్టాల్ని చూడలేక ప్రతిరోజు కొన్ని రొట్టెలను చేయించి అందరికీ పంచిపెట్టే వాడు.

రొట్టెలు పంచుతూంటే పిల్లలందరూ వానికొరకు నెట్టుకపోయే వాళ్లు. అందరూ పెద్దరొట్టెలకోసం తగుల్లాడి తెచ్చుకునేవారు. కాని ఒక చిన్న బాలుడు మాత్రం వారివెనుక నిలుచుండి వాళ్లందరూ వెళ్లిపోయేదాకా కాచుకొని యుండి ఆఖరుకు ఒక చిన్నరొట్టె దొరికితే తీసుకొని పోయేవాడు. రోజూ ఇలాగే జరిగేది. జమీందారు ఈ సంగతి కనిపెట్టారు.

ఆయన మర్నాడు రొట్టెలు చేయించాడు. ఒకచిన్నరొట్టెలో సవర్లు ఉంచాడు. పిల్లలందరూ పెద్దరొట్టెలు తీసుకొనిపోగా ఆ చిన్నరొట్టె మాత్రం మిగిలింది. ఆ చిన్నపిల్లవాడు రొట్టెను తీసుకొని యింటికిపోయి తుంచగానే సవర్లు రాలాయి.

వాళ్లమ్మ ఆ సవర్లు చూచి "నాయనా! ఇవి జమీందారుగారు పొరబాటున ఉంచారేమో వానిని తీసుకపోయి ఆయనకే ఇమ్మని" పంపింది.

ఆ పిల్లవాడు ఆ సవర్లను తీసికెళ్లి జమీందారుకిచ్చాడు.

ఆయన వానిని తీసుకోకుండా. "అబ్బాయీ! నీ ఓర్పుకు ఇది బహుమానం తీసుకపొమ్మ" న్నాడు.

ఆ పిల్లవాడు సంతోషంతో సవర్లనుతీసుకొని ఇంటికొచ్చాడు.

రచన: వాసిపల్లె లక్ష్మమ్మ,
పంచాయతీబోర్డు స్కూలు లక్ష్మీపురం

# క చ ట త ప గా ర డీ!

| క | చ | ట | త | ప |
|---|---|---|---|---|
| 3 | 3 | 5 | 9 | 17 |
| 5 | 6 | 6 | 10 | 18 |
| 7 | 7 | 7 | 11 | 19 |
| 9 | 10 | 12 | 12 | 20 |
| 11 | 11 | 13 | 13 | 21 |
| 13 | 14 | 14 | 14 | 22 |
| 15 | 15 | 15 | 15 | 23 |
| 17 | 18 | 20 | 24 | 24 |
| 19 | 19 | 21 | 25 | 25 |
| 21 | 22 | 22 | 26 | 26 |
| 23 | 23 | 23 | 27 | 27 |
| 25 | 26 | 28 | 28 | 28 |
| 27 | 27 | 29 | 29 | 29 |
| 29 | 30 | 30 | 30 | 30 |
| 31 | 31 | 31 | 31 | 31 |
| | | | | |

# తలచుకొన్న అంకె చెప్పాట!

రచన: ధవళ సత్యనారాయణమూర్తి (వైజాగ్)

ఈ ప్రక్క పేజీలో పటములో క, చ, ట, త, ప అను అక్షరములక్రింద నిలువు వరుసలలో కొన్నికొన్ని అంకెలు ఇచ్చితివి. ఆ అంకెలలో దేనినైనను ఒక అంకెను తలచుకొండి. మీరు తలచిన అంకె ఆ ఒక్కవరుసలోనేగాక, తక్కిన వరుసలలో గూడ ఉండవచ్చును. ఉదాహరణకు, మీరు 25 అంకె తలుచుకున్నారనుకొండి. 25 "క" వరుసలోను "త" వరుసలోను, "ప" వరుసలోనూ వున్నది.


మీరు తలచుకొన్న సంఖ్యా వాకు చెప్పకుండా "క, త, ప" అని చెప్పినయడల నేను మీరు తలచుకొన్న సంఖ్యను చెప్పగలను. ఎలాగంటే–రహశ్యం!

క విలువ 1; చ విలువ 2; ట విలువ 4; త విలువ 8; ప విలువ 16. ఇలాగ ఈ విలువలు నేను జ్ఞాపకముంచుకొని క + త + ప = 1 + 8 + 16 = 25 అని మీరు తలచుకొన్న సంఖ్యను తెలుసుకున్నాను.

ఇలాగే ఏ సంఖ్య తలచుకొన్నా చేయవచ్చును.

మీరుకూడా మీ స్నేహితులకు యీ గారడీచేసి చూపండి. ఏం?








ఈపై బొమ్మలో గదులలో అక్షరాలున్నాయి. అవి కలిపి చదువుతే రెండు సామెతలు అవుతాయి చదవండి.

బొమ్మ, కూర్పు: వి. సరోజిని (మద్రాసు)

## బాతు బొమ్మ



రచన: నీలంరాజు మురళీధర,

(మద్రాసు) వయస్సు 11.

## "బాల" చిట్టి ఏజంటు పెళ్లి

కర్నూలులో శ్రీ టి. బాల నాగయ్య శెట్టిగారి కుమారులు చి॥ టి. వెంకటేశ్వర్లు (మా 'బాల' చిట్టి ఏజంటు) గారి వివాహం యీమధ్యనే తిరుపతిలో జయప్రదంగా జరిగింది. వధువు చి॥ సౌ॥ జె. లక్ష్మమ్మ. వీరికి ఆయురారోగ్యైశ్వర్యములు భగవంతుడు ప్రసాదించుగాక !

తప్పు : క్రిందటి సంచికలో "బ్రహ్మకు తలలు మూడు" అని తప్పు పడింది. దానికిబదులు "శివునికి కళ్లు మూడు" అని వుండాలి. —సం॥

## ఖద్దరు బట్టలు

పెట్టండోయ్ — పెట్టండి.
తకిలీరాట్నం — పెట్టండి.
వడకండోయ్ — వడకండి.
సన్నని నూలు — వడకండి.
ఈయండోయ్ — ఈయండి.
సాలిచేతికి — ఈయండి.
కట్టండోయ్ — కట్టండి.
ఖదరు బట్టలు — కట్టండి.
మ్రొక్కండోయ్ -- మ్రొక్కండి.
గాంధీతాతకు — మ్రొక్కండి.

రచన: యం. యస్. సురేంద్రనాద్ గుప్త, (రెండవఫారం, హిందూపురము)


## లిటిల్స్ ఓరియంటల్ బాం




తలనొప్పి
బెణుకులు
నడుమునొప్పి
తుంటినొప్పి
కీళ్లవాతము
కండరముల పోటులను
నివారించును.

### వాడినవారి అభిప్రాయాలు

బెరెల్లీనుండి సి. ఎర్లేగారు ఇలా వ్రాశారు :

"తలనొప్పులకు, కీళ్లనొప్పులకు, ఇతర నొప్పులన్నిటికీకూడ నేను మీ అంజనం వాడుతున్నాను అన్నివేళలా బాధానివారణ పొందాను."

ఫరీద్‌పూర్‌నుంచి సుశీల చంద్రసేన్‌గారు ఇలా వ్రాశారు :

"నా ఎడమ మోకాలులో తీవ్రమైన కీలునొప్పితో బాధపడినప్పుడు, లిటిల్స్ ఓరియంటల్ బాం, ఇంద్రజాలంగా పనిచేసింది."

# దసరా విడుదల! అక్టోబరు 4-వ తేదీనుండి

బెజవాడ—దుర్గకళామందిరం

రాజమండ్రీ—శ్రీరామా టాకీస్

కాకినాడ—క్రౌన్ టాకీస్

బందరు—బృందావన్

తెనాలి—వెంకటేశ్వర టాకీస్

గుంటూరు—రాధాకృష్ణా టాకీస్

సారథీ వారి

# గృహప్రవేశం

**భానుమతి....సి. యస్. ఆర్....ప్రసాద్**

హేమలత....శ్రీరంజిని.... శివరావు....రంగస్వామి.

**DIRECTED by PRASAD**

*Studio*: NEWTONE



డిస్ట్రిబ్యూటర్లు:

ఆంధ్ర, దత్తమండలములకు
సరస్వతీ టాకీస్, బెజవాడ.

సికింద్రాబాద్, హైదరాబాద్ స్టేట్‌కి
మల్లికార్జున పిక్చర్స్, సికింద్రాబాద్.


ఇతర వివరములకు: సారథీ ఫిలింస్ లిమిటెడ్, త్యాగరాయనగర్, మద్రాసు.

# గుండుసూది గారడీ!


సంపాదన: "మునసబు"

మీరు ఎప్పుడేనా గుండుసూదిని చూశారా? ఇప్పుడు గుండు సూది గారడీ చెప్తాను.

మీరు ముందు ఒకగ్లాసుతో నీళ్లు, ఒక గుండుసూది, ఒక చిన్న అద్దు కాగితం, అంటే బ్లాటింగు కాగితపుముక్క తెచ్చుకొండి. ఆ గుండుసూదిని నీళ్లలో వెయ్యండి. అదిమునిగిపోతుంది. ఆ గుండు సూది పైకి తీసి వెయ్యండి. (తీస్తున్నప్పుడు జాగ్రత్త! వేలుకి గుచ్చుకోగలదు!)




ఒక చిన్న అద్దు కాగితపుముక్క చింపి ఆ నీళ్లలో పడవేయండి. అది నీళ్లలో తేలుతుంది. దానిమీద యీ గుండుసూదిని మెల్లగా పడవెయ్యండి. మీరు తొందరపడకుండా, ఓపికగా, చూస్తూవుండండి. గ్లాసుమాత్రం కదపకండి. మీరు చూస్తూవుండగానే ఆ అద్దుకాగితం మునిగిపోయి ఆ గుండుసూది నీటిమీద తేల్తుంది! చూడండి యీవింత!




# మద్రాసు

మద్రాసునగరం మన దేశపు తూర్పుతీరాన్నుంది. బొంబాయిలాగే యిదికూడా మొట్టమొదట ఒక పల్లెటూరు. ఆ వూరిపేరు 'మద్రాసుపట్నం'. ఆ వూళ్లో జాలర్లు సముద్రపు ఒడ్డున గుడిసెలలో కాపురాలుండేవారు. అయితే వీళ్ల రాజెవరో తెలుసా? మన తెలుగు రాజే! తిరుపతి పక్కన చంద్రగిరి అనే వూళ్లో రాజ్యంచేస్తూండేవాడు.

పదిహేడవ శతాబ్దంలో తూర్పుఇండియా సంఘమువారు చంద్రగిరిరాజు నడిగి మద్రాసు పట్నానికి పక్కనే కొంతచోటు సంపాదించుకున్నారు. అక్కడనే సెంటుజార్జి అనే పేరుతో ఒక కోటను కట్టారు. ఆ కోటలోపల అంగళ్లు, దేవుడి గుళ్లు కట్టుకున్నారు.

క్రమక్రమంగా ఈ కోటకు వుత్తరాన పెద్దవూరు పెరిగింది. ఆ వూళ్లో సాలెలు వర్తకులు నివసించేవారు. అప్పుడీవూరికి 'చెన్నప్పపట్టణం' అని పేరుండేది. ఐతే ఇంగ్లీషువాళ్లు దీనినే బ్లాక్ టౌను-నల్లపట్నం అని పిల్చేవారు. తర్వాత అది జార్జిటౌనుగా మారింది.

మరికొన్నాళ్లకు మద్రాసు పట్నం చెన్నప్ప పట్టణం కలసి పెద్దనగరమైంది. ఇంగ్లీషువాళ్లు దీన్నే 'మెడ్రాస్' అంటారు.

మనం చెన్నపట్నం అంటాము. మనరాజధానికిది ముఖ్యపట్నం.

ఇప్పు డీనగరం చాలాపెద్దది. అందమైనదికూడా! ఈ నగరంలో చైనాబజారు, మౌంటురోడ్డు అనే బజార్లున్నాయి. అక్కడ ఎన్నో వందల అంగళ్ళున్నాయి. మూర్‌మార్కెట్టు అనే బజారు కూడా వుంది. ఇక్కడ జపాన్ బొమ్మలు, టోపీలు, పుస్తకాలు, కూరగాయలు అమ్ముతారు.

దీనివెనుకనే 'పీపుల్సపార్కు' అనే తోటవుంది. ఆ తోటలో పెద్దపులులు, ఏనుగలు, ఎలుగు బంటులు, జిరాఫీలు, రకరకాల కోతులు, పాములు, రంగురంగుల చిలకలు, నెమళ్లు, మొసళ్లు వుంటాయి. ఈచోటునే 'జూ' అంటారు. దీన్నిచూడటానికి చాలా మంది వెళ్తారు.

ఎగ్మూర్‌లో 'మ్యూజియమ్' అనేదివుంది. అక్కడ చచ్చిపో యిన జంతువుల ఎముకలగూళ్లు, తుపాకులు, కత్తులు, ఫిరంగులు, దేవుడి విగ్రహాలు వుంటవి. అందరు దీన్ని తప్పకుండా చూడాలి.

ఈ వూళ్లో పిచ్చివాళ్లకు ఆసుపత్రివుంది. మూగవాళ్లకు చెవిటివాళ్లకు చదువుచెప్పే బడికూడా వుంది, ఇంకా డాక్టర్ల కాలేజీలు, టీచర్ల కాలేజీలు. ప్లీడర్లకాలేజి మరికొన్ని యితర కాలేజీలు వున్నాయి మద్రాసులో.

చైనాబజారులో ''హైకోర్టు'' అనే పెద్ద భవనముంది. దాని మీద 'లైట్‌హౌస్' అని 160 అడుగుల ఎత్తుగల దీపస్తంభం ఒకటుంది. ప్రతిరోజూ సాయంకాలం ఆ స్తంభంచివరలో ఒక పెద్దలైటు వెలిగిస్తారు. ఈ లైటు సముద్రంలో 20 మైళ్ల దూరాన్నుండే స్టీమర్లకు కనిపిస్తుంది. ఈ స్తంభం చివరకెళ్లి చూస్తే మద్రాసంతాకనిపిస్తుంది. మద్రాసులోకూడా హార్బరుంది.

మద్రాసులో సముద్రపుఒడ్డుకు 'మెరీనా' అని పేరు. రోజూ సాయంకాల మయ్యేసరికి కొన్ని వందలమంది మగవాళ్లు, ఆడవాళ్లు, బాలలు, బడిపిల్లలు, దొరలు, దొరసాన్లు వస్తారిక్కడికి. అక్కడ ఇసుకలో కూర్చుంటే సముద్రము, దూరానస్టీమర్లు,

చిన్న చిన్న పడవల్లో చేపలుపట్టే జాలరులు, కనిపిస్తారు. రేడియో పాటలు వినబడుతాయి. చాలా హాయిగా వుంటుందిక్కడ.

మెరీనాలో ఒక చోటుంది. అక్కడ గాజుచెరువుల్లో చేపలు పెంచుతారు. బంగారు వన్నె, ఎఱుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగులు కలిగివుండే చేపలు, సముద్రపు తాబేళ్లు, వింతైన జంతువులు నీటిలో ఈతకొడుతూంటాయి.

మెడ్రాసులో ఎన్నో వార్తా పత్రికలు, బొమ్మల పత్రికలు, అచ్చవుతవి. నీ చేతిలో వుండే పుస్తకంకూడా అక్కడిదే!


## CంGంPల్లి

బావగారికి-

AమంD మీ ఊరిలో Pప్పరమెంటు Bళ్లలు, KBG బుట్టలు, అరTగెలలు, Cలుక రిబ్బన్లు ఉన్నాయా? ఉంటే రకమునకు Oక్కొక్కTIతే చాలు, Eచ్చటంతా క్షేమం, Eది Yనముగా చదువుకొంD, Eంతే Vశేషములు,

Eట్లు,
VధేUరాలు
ఉపూడి కాత్యాEనీదేవి,
Vజయనగరం.

## పోలికలు



# మీకు ఏమి కావాలి?

వడ్లు, పిండి, మిరపకాయలు, శీకాయ మొదలైన, దంపుడు మిషన్లున్నూ, వాటికి కావలసిన చిల్లర సామాన్లున్నూ, బెల్టులు, తదితరవస్తువులున్నూ, మావద్ద దొరకును.

గొప్ప పనితనము, చాలాకాలము మన్నును.

**ధరలు చాలా తక్కువ.**

... వివరాలకు ...

## ఆర్. ఆర్. బ్రదర్సు & కో.,

(మిషనరీ వ్యాపారులు)

306, లింగశెట్టి వీధి ... జి. టి. మదరాసు.

## R. R. BROTHERS & Co.,

MACHINERY MERCHANTS

**306, LINGHI CHETTY STREET, G. T. MADRAS.**



కొత్త పుస్తకం! అచ్చులో వుంది!! పిల్లల పుస్తకం!!!

# "తెలుగు తల్లి"

ప్రతిబాలుడు, ప్రతిబాలిక తప్పక చదవాలి

ఈ పుస్తకంలో

మన తెలుగుదేశం, పట్టణాలు, పల్లెలు, పరిశ్రమలు, తెలుగు ఆటలు, పాటలు, అందాలు, పండుగలు, తెలుగువీరులు, నాయకులు, కవులు, విజ్ఞానవిషయాలు, అన్నిటిగురించి పిల్లలకు అర్థమయే శైలిలో చక్కని పెద్ద అచ్చుతో, బొమ్మలతో తయారవుతోంది.

రచన: మాగంటి బాపినీడు

వివరములకు: **జాతీయ జ్ఞానమందిరం**

త్యాగరాయనగరము, మద్రాసు.

# కావాలోయ్
## కావాలి

పిల్లికి ఎలుక
పాపకి పలక
పంతులుకి పిలక
నూతికి గిలక
కావాలోయ్ కావాలి!

ఆటకి గవ్వ
తాతకి అవ్వ
పాపకి బువ్వ
కొత్తకి తవ్వ
కావాలోయ్ కావాలి!

మంచికి మాట
పిల్లకి పాట
నడకకు బాట
పందిరకు రాట
కావాలోయ్ కావాలి!

పొయ్యికి పుల్ల
కవరుకు బిల్ల
వ్రాతకు బల్ల
గోడకు వెల్ల
కావాలోయ్ కావాలి!

రచన : పూసర్ల రామావతారం
(పెద్దాపురం)




## బాల బహుమానాలు

ఈ నెల లాటరీలో యీ దిగువ బాల చందాదారులకు బహుమానాలు వచ్చాయి. ఒక్కొక్కరికి 1 రూ॥ చొప్పున మనియార్డరు పంపబడును.

—మేనేజరు.

| | చందా నెం॥ |
|---|---|
| శ్రీ తేలప్రోలు రాణీవారు (నూజివీడు) | 550 |
| C. రామయ్యశెట్టి (నెల్లూరు) | 537 |
| హెడ్‌మాస్టర్, గవర్నమెంటు సెకండరీ ట్రెయినింగు స్కూలు (నెల్లూరు) | 30 |
| శక్రెటరీ, స్టూడెట్సు కాంగ్రెస్, (ఉప్పుగుండూరు) | 450 |
| P. V. రాఘవరావు (నూజివీడు) | 973 |
| G. V. రాయ్ (కాకినాడ) | 43 |
| ఇంగువ లక్ష్మీనారాయణమూర్తి (మచిలీపట్టణం) | 990 |
| శ్రీ కొత్తపల్లి యామినీపూర్ణ తిలకమ్మ (కూచిపూడి) | 459 |
| పుప్పా నరసింహం (బొంబాయి) | 386 |
| వి. హనుమంత నాయుడు (విల్లంపేట) | 490 |


ఉజ్జ్వలమైన సతీత్వము



పండిత్ డి. గోపాలాచార్యులవారి

అరుణ

గర్భాశయరోగ నివారిణి!




అరుణ ఋతుదోషములను పోగొట్టి, పరిపూర్ణ స్త్రీత్వమును ప్రసాదించగల స్వయం సంపూర్ణమగు ఔషధము. అట్టి దానిని విడువక సేవించినట్లయితే, మిమ్ము ఆరోగ్యవంతులను జేయుటయేగాక, మీ జీవిత పరమావధియగు ఆనందమును తప్పక యొసగును.

ఆయుర్వేదాశ్రమం, లిమిటెడ్
టి-నగర్.... మద్రాసు.

EASTERNS 378.

# పొడుపు కథలు

## 1

మట్టి కోట
దానిపై కంచుకోట
దానిపై పూల కోట
దానిపై ఐదుగురు దొంగలు
ఆడుతున్నారు!

## 2

గుప్పిడు గువ్వకు
బారెడు తోక!

## 3

దమ్మిడీ గుర్రం
దుమ్ములేపింది.

## 4

త్రాచు కాదు, ఐదునాలుకలు!

## 5

తెల్లని మడిలో
నల్లని విత్తనాలు
చేత్తో జల్లి
నోటితో ఏరుతారు.

సంపాదన: రమణ-సుబ్బులక్ష్మి,
రామచంద్రపురం.

[జవాబులు యీ సంచికలోనే వున్నాయి]

# దు

జై గోవిందు
జై గోవిందు
గాంధికి విందు
బూందీ తిందు
బడిలో హిందూ -
స్థానీ విందు
ఏకుల రాట్నం
తీయా మందు
బాలను గొందు
బాగుగ నుందు
జైజై యందు
జై హిందు!

రచన: కుక్కడపు సత్యనారాయణ
(మునగాల)






# అక్కతో 5 నిమిషాలు

చిట్టి చెల్లాయిలూ!

చిట్టి తమ్ముళ్లూ!

దసరాలో యీమధ్య నేను చాలామంది ఇళ్లల్లో బొమ్మల కొలువులు చూచాను. ఈ ఏడు కొత్తబొమ్మల్లో గాంధీజీ బొమ్మలు, జవహరుబొమ్మలు, నేతాజీబోసు బొమ్మలు చాలామంది కొన్నారు.

కొలువుల్లో బొమ్మల్ని బట్టి, కొలువు ఎలాగ అలంకరించారో దానినిబట్టి, వారివారి అభిరుచులు తెలుస్తాయి.

పూర్వం రోజుల్లో దొరటోపీ బొమ్మలు, దొరసాని బొమ్మలు చాలా మంది కొనేవారు. ఈ రోజుల్లో మన దేశీయనాయకుల బొమ్మలు కొంటున్నారు.

పూర్వం ఒక పార్కు వేసి, అందులో మట్టితో రోడ్లు వేసి ఆ రోడ్లమీద మోటారు కారు బొమ్మ, సైకిలు తొక్కుతున్న బొమ్మ పెట్టేవారు. నేను మొన్న చూచిన ఒకకొలువులో మట్టితో భారతమాత (హిందూ దేశం) బొమ్మ వేసి, దానిలో పండే పంటలూ, తోటలూ, అడవులూ అన్నీ ఎంతో చిత్రంగా వేశారు.

ఇంకో కొలువులో ఒక హిందువు, ఒక మహమ్మదీయుడు జట్టు కట్టుకొని వెళ్తున్నట్టు బొమ్మలు తయారు చేశారు. హిందువులు, మహమ్మదీయులు కలసిమెలసి అన్నదమ్ములాగ వుండాలని దాని భావం.

ఇలాంటి కొత్తకొత్త రకం బొమ్మల కొలువులు చూడ్డానికి ఎంతో బాగుంటాయి కదూ!

♦ ♦ ♦

క్రిందటి 'బాల' లో "అల్లరి ప్రకాశం" -ప్రధాని ప్రకాశం"-

అని శ్రీ ప్రకాశంగారి చిన్నతనం ముచ్చట్లు గురించి పడింది. చదివారా?

విజయనగరంలో బాలమనోహర్ అని, ఒక చిన్నఅబ్బాయి వున్నాడు. ఆమనోహర్‌కి ఆరేళ్లు. రెండో క్లాసు చదువుతున్నాడు. క్రిందటి 'బాల' రాగానే అందులో "అల్లరిప్రకాశం" గురించి వుంది. ఆ వ్యాసాన్ని వాళ్లఅమ్మ చేత చదివించుకున్నాడు. తరవాత బడికి వెళ్లాడు. సాయంత్రం 6 గంటలు అయింది. ఇంకా ఇంటికి తిరిగిరాలేదు. వాళ్లఅమ్మ గాబరాపడింది. ఇంతలోకీ వాళ్ల బడినుంచి కబురు. ఏమని? మనోహర్ వాళ్లబడిలోని ఒక కుర్రాడి పుస్తకాలు సైడుకాలువ ప్రక్కను చింపి పారవేశాడట! పంతులమ్మ, బోర్డుమీద లెక్క వేస్తుంటే, ఆమె పమిటచెంగు బోర్డుస్టేండుకు కట్టి వేశాడట! పంతులమ్మ ఇటు తిరగగానే ఆ బోర్డు దభాలున క్రిందపడిందట . .

ఈ సంగతంతా విని ఆ కుర్రాడ్ని వెతికి, నాలుగు చీవాట్లుపెట్టి అడిగారట-ఏమిరా ఎప్పుడూ లేని అల్లరి ఎందుకు చేశావని.

ఆ ప్రశ్నకి బాల మనోహర్ :

"అల్లరి ప్రకాశం ఆఖరికి పెద్ద మంత్రి అయాడు కాదూ?–నేను కూడా అలాగే అవుతాను." అని జవాబిచ్చాడట!

అల్లరి ప్రకాశం అల్లరే కాకుండా, బడిలో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకొనే వాడు. మనంకూడా అలాగే చదువుకొని,మంచి మార్కులు తెచ్చుకోవాలి కదూ!

---

# బాల సంఘాలు

"బాలచంద్ర సమాజము"
ట్రిప్లికేను :

1-10-46 తేదీని స్థాపింపబడింది. కార్యదర్శి శ్రీ వై. పి. చందర్. N. సర్వేశ్వరరావు సహాయ కార్యదర్శి. 20 మంది సభ్యులు. పుస్తకాగారములో 100 పుస్తకములున్నవి. నాటక ప్రదర్శనములు, పోటీలు మొదలగునవి జరుప

బడును. ''సంధ్య'' అనే వ్రాత పత్రిక వెలువడును.

కోరుమిల్లి బాలసంఘం :

20-9-46 తేదీని స్థాపించబడింది. 18 గురు బాలికలు మెంబర్లు, శ్రీ గొర్తి సుబ్బారావుగారు అధ్యక్షులు. శ్రీ సాలాది సీతారత్నం కార్యదర్శిని. బాల సంఘం చేయవలసిన పనులగురించి శ్రీ శలపాక సూర్యనారాయణగారు ఉపన్యశించిరి.

శ్రీపతి బాలసంఘం, అచ్చెనపల్లె :

సెప్టెంబరు 25 తేదీని శ్రీ బి. కామయ్య బి. ఏ. బి. ఇడి (రాజంపేట సీనియర్ ఇన్‌స్పెక్టరు) వారి అధ్యక్షతను యీ సంఘ సభ జరిగింది. అధ్యక్షుడు 'విద్య'ను గూర్తి ఉపన్యశించారు. బాలికలు కోలాటం వేశారు. చాలామంది తలిదండ్రులు హాజరయినారు.

ఆంధ్ర కేసరీ బాలసంఘం, పెదపూడి :

సెప్టెంబరు 9 వ తేదీని యీ సంఘము డాక్టరు జిడ్డు సత్యనారాయణ మూర్తిగారి అధ్యక్షతను స్థాపించబడింది. బీదలకు సహాయముచేయుట, విద్యను వ్యాపింపజేయుట యీ సంఘము యొక్క ఆశయము. పి. సూర్య ప్రభాకరాచార్యులు కార్యదర్శి.

అనకాపల్లి బాలసంఘాలు :

అనకాపల్లిలో శ్రీ తమ్మన రాజామణి కార్యదర్శిగా నడపబడుతున్న బాలసంఘములో 36 గురు సభ్యులున్నారు శ్రీ యు. వి. జగన్నాథ రాజు కార్యదర్శిగను, శ్రీ పి. అప్పల నరసింహరాజు అధ్యక్షులుగను విజయా బాలసంఘము సెప్టెంబరు 15 వ తేదీని స్థాపింపబడింది. వినాయక చవితినాడు శ్రీ సూరిశెట్టి సాంబశివరావు బాబ్జీగారి యాజమాన్యమున బాల కాంగ్రెస్ స్థాపించబడింది. ఈ బాల కాంగ్రెస్‌లో జైహింద్ బాలసేన తయారవుతోంది. శ్రీ సూరిశెట్టి జీవరత్నరావు కార్యదర్శి.

శేపాల బాలసంఘం :

సెప్టెంబరు 8 వ తేదీని శ్రీ కందుల హనుమయ్యగారి యాజమాన్యమున బాలసంఘము ఏర్పడింది. అక్టోబరు నెలలో పోటీలు జరుపుటకు అనుకుంటున్నారు.

జైహింద్ బాలసంఘం, రాజమండ్రి :

సెప్టెంబరు 20 తేదీని సభ జరిగింది. సంఘ అభివృద్ధిని గురించి కొందరు మాట్లాడారు.


రామచంద్రరావుపేట బాలసంఘము (ఏలూరు) :

శ్రీ అడవి రామచంద్రరావు అధ్యక్షతను సెప్టెంబరు 24 వ తేదీని యీ సంఘం ఏర్పడింది. శ్రీ కవిదండి ఆంజనేయులుగారు శక్రెటరీ. 15 మెంబర్లు చేరారు. ఆట పోటీలు జరిగాయి.



# ఇది చెప్పుకో చూద్దాం ???

## I—ముక్కోణములు



ఈ పైగదిలో ఎన్ని ముక్కోణాలు ఉన్నవో చెప్పగలవా?

సంపాదన: బి. నరసింహులు (త్రిప్లికేను)

## II—నూరు

1 నుండి 9 వరకుగల అంకెలతో 100 చేయగలవా? అన్ని అంకెలూ వాడవలెను. వాడిన అంకె తిరిగి వాడరాదు.

సంపాదన: నిడమర్తి నరసమాంబ (శ్రీకాకుళం)

షరా:—ఈ రెండు ప్రశ్నలకును సరియైన జవాబులు పంపినవారి పేర్లే వచ్చే సంచికలో ప్రచురిస్తాం. జవాబులు 25-వ తేదీలోపుగా అందాలి—సం॥


బాల


సం॥ చందా రూ 5/-
(ప్రత్యేక సంచికతో సహా)
వీ. పి. పద్ధతి లేదు.

# సెప్టెంబరు 'బాల' లోని ప్రశ్నలకు జవాబులు

## I. చదరము

ఈ దిగువ బొమ్మల విధముగా ముక్కలుకోసి తిరిగి అతికినచో చదరము అగును.






## II. ఏమిటి?

"ఆ" అనే అక్షరం.

---

ఈ పై ప్రశ్నలకు జవాబులు పంపినవారు:

రాజమండ్రి: అల్లు నూకరాజు, టి. కృష్ణమోహన్‌రావు, జి. అలివేలు మంగతాయారు, దాసు లలితాంబ, డి. పురుషోత్తమరావు, డి. సంరక్షణ రావు, డి. నాగేశ్వరి; భద్రాచలం: యం. వి. సుబ్బారావు; గుంటూరు: డి. గంగాధరరావు.



# ఆలిండియా రేడియో

## పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినొచ్చు.]

[మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు]

## అక్టోబరు

### 6 వ తేదీ ఆదివారం

రారె చిన్ని పిల్లరార - పిలుపుపాట; ఉత్తరాలసంచి; గులాబిగాణి - నాటిక; పుట్టినరోజులు; దసరాపద్యాలు; పప్పుబెల్లాలు - రూపకం; చిక్కుప్రశ్న; కథలు, కబుర్లు; పోదామా.

### 13 వ తేదీ ఆదివారం

రారె చిన్ని పిల్లలార - పాట; ఉత్తరాలసంచి; హాతింతాయి-నాటిక; పుట్టినరోజులు: భూగోళ విచిత్రాలు; శాలివాహన కథ; కబుర్లు; కథలు; పోదామా.

### 20 వ తేదీ ఆదివారం

రారె చిన్ని పిల్లలార - పాట; ఉత్తరాలసంచి; సత్యము - అసత్యము - నాటిక; పుట్టినరోజులు; శిసింద్రీ - రూపకం; మెలికిమాట; పోదామా.

### 27 వ తేదీ ఆదివారం

రారె చిన్ని పిల్లలార - పాట; ఉత్తరాలసంచి; పుట్టలోపాలు - రూపకం; నాగులచవితి - పాట; పుట్టినరోజులు; చిక్కుప్రశ్న; మీరు పంపిన కథలు, నాటికలు; పోదామా.

74-వ పేజీలోని పొడుపు కథలకు జవాబులు :

1. అన్నపుగిన్నె; 2. కలువపువ్వు; 3. సాంబ్రాణి; 4. చేయి; 5. కాగితంమీద అక్షరాలు.

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras. Printed by B. Nagi Reddy at B. N. K. Press, 37, Acharappan St., G. T. Madras,

# బాల

<u>చందా వివరాలు</u>

సంవత్సర చందా : రూ 5/-

(ప్రత్యేక సంచికతో సహా)

అర్ధ సంవత్సరం చందా లేదు

వీ. పీ. పద్ధతి లేదు.

★

*Advertisement Tariff:*

SINGLE INSERTION


| | | |
|---|---|---|
| INSIDE FULL PAGE | Rs. | 50 |
| ,, HALF PAGE | ... | 30 |
| WRAPPER II & III | ... | 75 |
| LAST COVER (2 col.) | ... | 120 |

★

'BALA'

**20, SUNDARESWAR ST.,**

**MYLAPORE MADRAS 4.**




PRINTED AT THE B. N. K. PRESS, 37, ACHARAPPAN ST. G.T. MADRAS